# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | బుధవారం - 13 - మే - 2026 | సంపుటి : 3 | సంచిక : 345 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



## కొడుకుపై కేసు..
## బండి ఎమోషనల్

"కొడుకుకు టైమ్ ఇవ్వకపోవడం నా తప్పు"

చట్టం, కోర్టు నిర్ణయాన్ని గౌరవిస్తానన్న బండి సంజయ్

"భగీరథ్‌ను టార్గెట్ చేస్తున్నారు" అంటూ ఆరోపణ

"ధర్మం కోసం చివరి వరకు పోరాటం" అంటూ వ్యాఖ్యలు



2లో

## బండి భగీరథ్‌కు సిట్ నోటీసులు

పోక్సో కేసులో విచారణకు హాజరుకావాలని ఆదేశం

పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు రావాలని సూచించిన ప్రత్యేక దర్యాప్తు బృందం



2లో



## జర్మనీలో ఉద్యోగాలకు మంచి అవకాశాలు

- నర్సులకు మంత్రి వివేక్ సూచనలు
- విదేశీ భాషలపై దృష్టి పెట్టాలని పిలుపు
- టామ్‌కామ్ ద్వారా అంతర్జాతీయ అవకాశాలు

**హైదరాబాద్, మే 12 (తెలంగాణ ముచ్చట్లు):**

జర్మనీలో యువతకు, ముఖ్యంగా నర్సింగ్ రంగంలో మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. టామ్‌కామ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "ట్రిపుల్ విన్ ప్రోగ్రామ్"లో శిక్షణ పొందుతున్న నర్సులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమై వారికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కొత్త భాష, కొత్త వాతావరణానికి అలవాటు పడటం ఒక సవాల్ మాత్రమే కాకుండా ఎదుగుదలకు మంచి అవకాశమని పేర్కొన్నారు. జర్మనీలో పనిచేసే అవకాశం రావడం యువత భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ముఖ్యంగా నర్సింగ్ వృత్తిలో సేవాభావం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు చాలా కీలకమని చెప్పారు. "రోగి వ్యాధిలో సగం, నర్సులు ఇచ్చే ధైర్యం వల్లే తగ్గిపోతుంది" అని మంత్రి వ్యాఖ్యానించారు.

మిగతా 2లో..



## జూన్ 2న రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు

- పేదల సొంతింటి కల సాకారం
- నియోజకవర్గాల వారీగా స్థలాల గుర్తింపు
- ప్రజాప్రతినిధులతో మంత్రి సమీక్ష

**హైదరాబాద్, మే 12 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేయడానికి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం రెండో విడతను జూన్ 2న ప్రారంభించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. రెవెన్యూ, గృహ నిర్మాణ అంశాలపై ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడత కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు.

మిగతా 2లో..



## ధాన్యం కొనుగోళ్లపై సీఎం ఆదేశాలు

- మిషన్ మోడ్‌లో సేకరణ పూర్తి చేయాలి
- రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- నిర్లక్ష్యంపై కఠిన హెచ్చరిక

**హైదరాబాద్, మే 12 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను మిషన్ మోడ్‌లో వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. క్యాంపు కార్యాలయం నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కొనుగోళ్ల పురోగతిని సమీక్షించారు. వివిధ జిల్లాల్లో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్లలో ఎదురవుతున్న సమస్యలపై కలెక్టర్లను అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రి, ప్రతి అంశాన్ని ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని సూచించారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తేనే సమస్యలు తలెత్తవని, ఎక్కడైనా నిర్లక్ష్యం జరిగితే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే గోదాములకు తరలించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. లారీల కొరత ఉంటే ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించాలని రవాణా శాఖ అధికారులకు సూచించారు.

మిగతా 2లో..




## నిలోఫర్ ఆస్పత్రిలో నర్సుల దినోత్సవం

- ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం
- నర్సులను సత్కరించిన మంత్రి పొన్నం
- సేవాభావానికి ప్రశంసలు

**హైదరాబాద్, మే 12 (తెలంగాణ ముచ్చట్లు):**

అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆసుపత్రిలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై నర్సులను సత్కరించారు. సమాజానికి అంకితభావంతో సేవలందిస్తున్న నర్సుల సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక అల, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకట్, నిలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయ్ కుమార్, ఆర్డీవో రామకృష్ణతో పాటు నర్సులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్, నర్సింగ్ అనేది సేవాభావం, కరుణతో ముడిపడిన గొప్ప వృత్తి అని అన్నారు. రోగుల సంరక్షణలో నర్సుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఆసుపత్రుల్లో ఒత్తిడి, సవాళ్లు ఉన్నప్పటికీ నర్సులు నిరంతరం సేవలందించడం అభినందనీయమన్నారు.

మిగతా 2లో..

## కల్వకుంట్ల కవితకు కోర్టు సమన్లు



- కామారెడ్డి రైల్‌రోకో కేసులో హాజరుకావాలని ఆదేశం
- బీసీ రిజర్వేషన్ల డిమాండ్‌తో నిర్వహించిన ఆందోళనపై కేసు నమోదు

**హైదరాబాద్, మే 12 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే ప్రధాన డిమాండ్‌తో కామారెడ్డిలో నిర్వహించిన రైల్‌రోకో కార్యక్రమం వ్యవహారం ఇప్పుడు న్యాయస్థానానికి చేరింది.

మిగతా 2లో..



## బీఆర్ఎస్‌లో సంస్థాగత మార్పులపై కీలక చర్చ

- ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన విస్తృత సమావేశం
- పార్టీ బలోపేతం, భవిష్యత్తు కార్యాచరణపై నేతలకు దిశానిర్దేశం

**హైదరాబాద్, మే 12 (తెలంగాణ ముచ్చట్లు):**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో కీలక సమావేశం జరిగింది. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిస్థితులు, పార్టీ భవిష్యత్తు కార్యాచరణ, సంస్థాగత బలోపేతం వంటి అంశాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని కేసీఆర్ నేతలకు వివరించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపేలా సంస్థాగత మార్పులు చేపట్టాలని సూచించినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయడంతో పాటు జిల్లా, నియోజకవర్గాల వారీగా పార్టీ ఇన్‌ఛార్జుల నియామకం, అంతర్గత కమిటీల ఏర్పాటు వంటి అంశాలు సమావేశంలో ప్రధాన చర్చగా మారాయి. ప్రజల్లో పార్టీకి మరింత చేరువ కల్పించేందుకు బూత్ స్థాయి నుంచి కార్యాచరణ బలోపేతం చేయాలని నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని క్యాడర్‌ను సమన్వయం చేసే దిశగా వ్యూహాలు

మిగతా 2లో..

బుధవారం - 13 - మే 2026

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# జర్మనీలో ఉద్యోగాలకు మంచి అవకాశాలు

(మొదటి పేజీ తరువాయి)

రోగులకోలుకోవడంలోనర్సులపాత్రఎంతో ముఖ్యమని కొనియాడారు. తెలంగాణ యువతకు అంతర్జాతీయ స్థాయి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు టామ్‌కామ్ ప్రత్యేకంగా కృషి చేస్తోందని తెలిపారు. ప్రస్తుతం జర్మనీకి వెళ్లే ఈ బ్యాచ్ విజయం సాధిస్తే భవిష్యత్తులో మరింత మందికి అవకాశాలు లభిస్తాయని మంత్రి పేర్కొన్నారు. జర్మన్ భాషను నేర్చుకోవడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రతిరోజూ కనీసం గంట సమయం నైపుణ్యాభివృద్ధికి కేటాయించాలని కోరారు. జర్మన్ పుస్తకాలు చదివే స్థాయికి చేరుకోవాలని, అక్కడి సంస్కృతిని కూడా అర్థం చేసుకోవాలని మంత్రి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం టామ్‌కామ్ కార్యక్రమాల కోసం ప్రత్యేక నిధులు కేటాయించిందని తెలిపారు. రాష్ట్రంలో నర్సింగ్ కళాశాలలు, సీట్ల సంఖ్య పెంపుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ హరిచందన మాట్లాడుతూ, తాను హిందీ సినిమాలు చూస్తూ హిందీ భాష నేర్చుకున్న అనుభవాన్ని వివరించారు. విదేశీ భాషలను నేర్చుకోవడం ఇప్పుడు చాలా సులభమైందని అన్నారు. ప్రభుత్వం ఉచితంగా విదేశీ భాషా శిక్షణ అందిస్తోందని, స్నేహితులతో కలిసి జర్మన్ భాషను సాధన చేయాలని సూచించారు. టామ్‌కామ్ డైరెక్టర్ కాంతి వెస్లీ మాట్లాడుతూ, జర్మన్ ఫెడరల్ ఎంప్లాయ్‌మెంట్ ఏజెన్సీతో టామ్‌కామ్ ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 46 మంది నర్సులు జర్మన్ భాషా శిక్షణ పూర్తి చేశారని, 15 మందికి ఆఫర్ లెటర్లు వచ్చాయని వెల్లడించారు. ఇప్పటికే ఏడుగురు నర్సులు జర్మనీలో ఉద్యోగాల్లో చేరినట్లు తెలిపారు.

# జూన్ 2న రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు

(మొదటి పేజీ తరువాయి)

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన విధివిధానాలపై ఈ నెల 21న జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు. పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు 5 నుంచి 8 కిలోమీటర్ల పరిధిలోనే ఇళ్ల నిర్మాణం చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గతంలో నగరాలకు దూరంగా నిర్మించిన ఇళ్లలో నివసించేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదని క్షేత్రస్థాయి పరిశీలనల్లో స్పష్టమైందని మంత్రి తెలిపారు. జీవనోపాధి అవకాశాలు దూరమవుతాయనే కారణంతో చాలా మంది అక్కడికి వెళ్లడం లేదని చెప్పారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు, ముఠికివాడలు, భూదాన్ భూములు, శిథిలావస్థలో ఉన్న పాత ఇళ్ల ప్రాంతాలను గుర్తించి కొత్త ఇండ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియలో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో శాసనసభ స్పీకర్ జి. ప్రసాద్ కుమార్, మంత్రులు డి. శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్, మండలి చీఫ్ విప్ పి. మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పేదలకు మెరుగైన గృహ వసతి కల్పించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.

# ధాన్యం కొనుగోళ్లపై సీఎం ఆదేశాలు

(మొదటి పేజీ తరువాయి)

ధాన్యం రవాణాలో జాప్యం జరిగితే రైతులు నష్టపోతారని పేర్కొన్న ముఖ్యమంత్రి, ఒప్పందం ప్రకారం వాహనాలు అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయడానికీ వెనకాడొద్దని స్పష్టం చేశారు. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదులు అందించాలని, తాలు, తరుగు పేరుతో అక్రమాలు జరగకుండా చూడాలని ఆదేశించారు.

కొన్ని ప్రాంతాల్లో గోదాముల కొరత ఉన్నట్లు సమాచారం వస్తోందని, అలాంటి చోట్ల తాత్కాలిక ఏర్పాట్లు చేయాలని సూచించారు. అవసరమైతే రైతు బజార్లు, ఫంక్షన్ హాళ్లను వినియోగించి ధాన్యాన్ని నిల్వ చేయాలని తెలిపారు. పరిస్థితులను బట్టి ధాన్యాన్ని అక్కడి నుంచి గోదాములకు తరలించేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. మొక్కజొన్న పంట అధికంగా పండే జిల్లాల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి చెప్పారు. రైతులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చోట పోలీసుల సహకారం తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ప్రతి ఐకేపీ కేంద్రం, ప్రతి రైస్‌మిల్లు వద్ద ఒక బాధ్యతాయుత అధికారిని నియమించాలని ఆదేశించారు.

అకాల వర్షాల సమయంలో రైతులకు నష్టం జరగకుండా శాశ్వత ప్రణాళికలు సిద్ధం చేయాలని కూడా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. వాతావరణ శాఖ హెచ్చరికలను రైతులకు చేరవేసేందుకు మండల స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీతక్క, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీ వేమ్ నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# కల్వకుంట్ల కవితకు కోర్టు సమన్లు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవితపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేయగా, ఈ కేసు విచారణలో భాగంగా సికింద్రాబాద్‌లోని ద్వితీయ న్యాయ మేజిస్ట్రేట్ ప్రథమ శ్రేణి కోర్టు ఆమెకు సమన్లు జారీ చేసింది. రేపు ఉదయం పది గంటల ముప్పై నిమిషాలకు వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలని న్యాయస్థానం ఆదేశించింది. కామారెడ్డిలో ఇటీవల నిర్వహించిన రైల్‌రోకో కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రైల్వే పట్టాలపై ఆందోళన చేపట్టారు. ఈ కారణంగా రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగిందని, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని రైల్వే అధికారులు పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘించి రైల్వే కార్యకలాపాలను అడ్డుకున్నారనే ఆరోపణలతో కల్వకుంట్ల కవితతో పాటు మరో పన్నెండు మందిపై రైల్వే చట్టంలోని 147, 74(ఏ) సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ వ్యవహారం రాష్ట్రరాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నంలో భాగంగానే ఈ ఆందోళన చేపట్టినట్లు తెలంగాణ రక్షణ సేన నాయకులు చెబుతున్నారు. సామాజిక న్యాయం కోసం పోరాటం చేస్తున్న తమపై కేసులు నమోదు చేయడం సరికాదని వారు వాదిస్తున్నారు. మరోవైపు ప్రజలకు అసౌకర్యం కలిగించేలా రైళ్లను అడ్డుకోవడం చట్ట విరుద్ధమని అధికారులు స్పష్టం చేస్తున్నారు. కల్వకుంట్ల కవితకు సమన్లు జారీ కావడంతో ఈ కేసుపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి పెరిగింది. రేపు ఆమె కోర్టుకు హాజరుకానుండటంతో తదుపరి పరిణామాలపై ఉత్కంఠ నెలకొంది. ఈ కేసులో కోర్టు ముందు ఆమె తరఫు న్యాయవాదులు తమ వాదనలు వినిపించే అవకాశం ఉంది. మరోవైపు బీసీ రిజర్వేషన్ల అంశంపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ మరింత వేడెక్కుతోంది. బీసీ వర్గాలకు అధిక రిజర్వేషన్లు కల్పించాలని చాలా కాలంగా డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జరిగిన రైల్‌రోకో ఆందోళన రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పుడు ఈ వ్యవహారం న్యాయపరమైన దశకు చేరడంతో తెలంగాణ రాజకీయాల్లో మరోసారి బీసీ రిజర్వేషన్ల అంశం ప్రధాన చర్చగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# బీఆర్ఎస్‌లో సంస్థాగత మార్పులపై కీలక చర్చ

(మొదటి పేజీ తరువాయి)

సిద్ధం చేసినట్లు సమాచారం. ప్రభుత్వ విధానాలపై ప్రజల్లోకి బలంగా వెళ్లేందుకు కార్యాచరణ ప్రణాళికపై కూడా నేతలు చర్చించినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో కేటీఆర్‌తో పాటు పార్టీ ప్రధాన కార్యదర్శులు, శాసనసభ, మండలి పక్షాల ముఖ్య నేతలు పాల్గొన్నారు. హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మధుసూదనాచారి, ఎల్ రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, తక్కెళ్లపల్లి రవీందర్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, బండ ప్రకాశ్ ముదిరాజ్, గంగాధర్ గౌడ్, జోగినపల్లి సంతోశ్ కుమార్, నారదాసు లక్ష్మణరావు, శ్రవణ్ కుమార్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, జీవన్ రెడ్డి, సోమా భరత్ కుమార్ గుప్తా, సత్యవతి రాథోడ్, రావుల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు సమావేశానికి హాజరయ్యారు. ప్రత్యేక ఆహ్వానితులుగా సురేశ్ రెడ్డి, మహమూద్ అలీ, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. రాబోయే రాజకీయ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని పార్టీని ప్రజల్లోకి మరింత సమర్థవంతంగా తీసుకెళ్లాల్సిన అవసరాన్ని కేసీఆర్ సమావేశంలో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించాలని, జిల్లా పర్యటనల ద్వారా పార్టీ క్యాడర్‌తో నేరుగా మమేకం కావాలని సూచించినట్లు సమాచారం. ప్రజా సమస్యలపై ఉద్యమాత్మకంగా ముందుకు వెళ్లడంతో పాటు ప్రభుత్వ విధానాలపై బలమైన స్వరం వినిపించాలని నేతలకు దిశానిర్దేశం చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పార్టీ పునర్వ్యవస్థీకరణ ద్వారా కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నింపాలన్న లక్ష్యంతో బీఆర్ఎస్ నాయకత్వం ముందుకు సాగుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# నిలోఫర్ ఆస్పత్రిలో నర్సుల దినోత్సవం

"రోగి కోలుకోవడంలో చికిత్స 50 శాతం పాత్ర పోషిస్తే, మిగతా 50 శాతం నర్సులు అందించే సంరక్షణ, సేవ, ధైర్యంపై ఆధారపడి ఉంటుంది" అని మంత్రి వ్యాఖ్యానించారు. రోగులకు ధైర్యం చెప్పి, ఆత్మవిశ్వాసం నింపడంలో నర్సులు ముందుంటారని కొనియాడారు. నిలోఫర్ ఆసుపత్రి దశాబ్దాలుగా చిన్నారులకు వైద్య సేవలు అందిస్తూ విశేష గుర్తింపు పొందిందని మంత్రి తెలిపారు. ప్రతిరోజూ సుమారు 1,500 మంది బయటి రోగులు ఆసుపత్రికి వస్తుండగా, దాదాపు 2,000 పడకలతో సేవలు అందిస్తున్నట్లు వివరించారు. కరోనా మహమ్మారి సమయంలో నర్సులు ప్రాణాలకు తెగించి చేసిన సేవలు ఎప్పటికీ మరువలేమని మంత్రి అన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో కూడా భయపడకుండా పనిచేసి ప్రజల ప్రాణాలను కాపాడారని పేర్కొన్నారు. నర్సులు వైద్య సేవలతో పాటు మానవత్వానికి ప్రతీకలుగా నిలుస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన సేవలు అందితే పేదలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి వస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో నర్సుల పాత్ర అమూల్యమని అన్నారు. సాయంత్రం సమయంలో నర్సులకు నియామక పత్రాలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

# బండి భగీరథ్‌కు సిట్ నోటీసులు

హైదరాబాద్, మే 12 (తెలంగాణ ముచ్చట్లు):

కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ కుమారుడైన బండి భగీరథ్‌కు ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ నోటీసులు జారీ చేసింది. మైనర్ బాలికపై లైంగిక దాడి చేశాడనే ఆరోపణల నేపథ్యంలో అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసు దర్యాప్తు చేపట్టిన సిట్ అధికారులు విచారణలో భాగంగా బండి భగీరథ్‌ను హాజరుకావాలని ఆదేశించారు. రేపు మధ్యాహ్నం రెండు గంటలకు పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి విచారణలో పాల్గొనాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

బండి భగీరథ్ కేంద్ర మంత్రికి కుమారుడు కావడంతో ఈ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. కేసు విచారణ పారదర్శకంగా, నిష్పాక్షికంగా జరగాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే డీజీపీకి ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి కేసును లోతుగా విచారిస్తున్నారు. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం కేసు తీవ్రత దృష్ట్యా సిట్‌కు దర్యాప్తు బాధ్యతలు అప్పగించారు. ఇక ఈ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. తనను హనీట్రాప్ చేశారని ఆరోపిస్తూ బండి భగీరథ్ కరీంనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. తనపై ఉద్దేశపూర్వకంగా కుట్ర జరుగుతోందని, తప్పుడు ఆరోపణలతో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ కేసు మరింత సంచలనంగా మారింది. ఒకవైపు బాధితురాలి కుటుంబం న్యాయం కోరుతుండగా, మరోవైపు బండి భగీరథ్ తనపై కుట్ర జరిగిందని చెబుతుండటంతో కేసుపై ఉత్కంఠ నెలకొంది. ఈ వ్యవహారంపై రాజకీయ వర్గాల్లో కూడా చర్చ కొనసాగుతోంది. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు వినిపిస్తున్నాయి. కేసును రాజకీయ కోణంలో కాకుండా చట్టపరంగా విచారించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. మైనర్ బాలికకు సంబంధించిన కేసు కావడంతో పోలీసులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. బాధితురాలి వివరాలు గోప్యంగా ఉంచుతూ చట్ట ప్రకారం విచారణ కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం అందరి దృష్టి రేపు జరగనున్న విచారణపైనే ఉంది. సిట్ అధికారులు బండి భగీరథ్ నుంచి వివరణ తీసుకుని తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. కేసుకు సంబంధించిన సాక్ష్యాలు, ఫోన్ వివరాలు, ఇతర ఆధారాలను కూడా అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో మరింత చర్చనీయాంశంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# కొడుకుపై కేసు.. బండి ఎమోషనల్

హైదరాబాద్, మే 12 (తెలంగాణ ముచ్చట్లు):

కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ వ్యవహారం ప్రస్తుతం దేశ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశం అవుతోంది. మైనర్ బాలికపై వేధింపుల కేసులో తన కొడుకు భగిరథ్ పై నమోదైన పోక్స్ కేసుపై కేంద్రమంత్రి బండి సంజయ్ మరోసారి స్పందించారు. ఈ మేరకు కరీంనగర్ లో హిందూ ఏక్తా యాత్రలో భాగంగా బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ ప్రజలకు హ్యాట్సాఫ్ చెప్పిన బండి సంజయ్.. హిందువుల ఐక్యతను చాటేందుకే 16 ఏళ్లుగా హిందూ ఏక్తా యాత్ర చేస్తున్నానని తెలిపారు. జై శ్రీరాం అనే నినాదమే హిందూ ధర్మాన్ని కాపాడుతుందని స్పష్టం చేశారు. హిందూ సమాజానికి ఆపదొస్తే జై శ్రీరాం నినాదంతో తెగించి కొట్లాడతామని పేర్కొన్నారు. కరీంనగర్ గడ్డ రక్తం తనలో ప్రవహిస్తుందని .. కరీంనగర్ లో గల్లీగల్లీలో ప్రజా సమస్యలపై కొట్లాడిన అని గుర్తు చేశారు. తన జీవితం కష్టాలు, బాధలే అన్నారు. అయిన బాధలను చూసి భయపడి పారిపోయేటోడ్ని కాదని పేర్కొన్నారు. ఏ హిందువుకు ఆపదొచ్చినా అండగా ఉన్నానని.. వారి ఇంట్లో పెద్ద కొడుకునైన తాను టైమంతా సమాజానికే ఇచ్చానని వివరించారు. తన కొడుకుకు టైమివ్వకుండా తాను తప్పు చేశానని.. తనను క్షమించాలని బండి సంజయ్ కోరారు. తన కొడుకును క్రిమినల్ గా చూపే ప్రయత్నం జరుగుతుందని బండి సంజయ్ ఆరోపించారు. తాను ఏ తప్పు చేయలేదని తన కొడుకు చెబుతున్నాడని చెప్పారు. అయినా తన కొడుకును తాను సమర్ధించడం లేదన్న బండి సంజయ్... తాను చట్టాన్ని, న్యాయాన్ని గౌరవిస్తానని వెల్లడించారు. కోర్టు నిర్ణయాన్ని శిరసా వహిస్తానని.. చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. ఈ సమయంలోనే తన భార్య సైతం తనను ఫాలో అవుతోందని.. తాను లేకున్నా కార్యకర్తలకు చేతనైనంత సాయం చేస్తోందని చెప్పుకొచ్చారు. అయితే ఈరోజు తన కుటుంబానికి నిప్పంటించారని ఫైర్ అయ్యారు. ఆ నిప్పుతో అవినీతి వ్యవస్థను దగ్ధం చేస్తానని.. అవినీతి, కుట్రలు చేసే గడీల బద్దలు కొడతానని శపథం చేశారు. తనను, తన కుటుంబాన్ని, తన కార్యకర్తలను ఇబ్బంది పెట్టినోడిని విడిచి పెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. అంతేకాదు తప్పుడు కేసులపై బండి సంజయ్ భయపడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. కాషాయ జెండా పట్టి కష్టాలు పడుతూనే ఉన్నా... అయినా బాధపడను.. ధర్మం కోసం పోరాడుతూనే ఉన్నానని వెల్లడించారు. తన చివరి శ్వాస వరకు హిందూ ధర్మం కోసమే పనిచేస్తానని స్పష్టం చేశారు.






# జూన్ 21న తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనం

## తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి

హైదరాబాద్,మే12(తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ రాష్ట్ర మలిదశ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్న ఉద్యమకారులను ఏకం చేస్తూ జూన్ 21న హైదరాబాద్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి, మూఢనమ్మకాల నిర్మూలన జాతీయ అధ్యక్షుడు బైరి నరేష్ వెల్లడించారు. బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా డాక్టర్ పిడమర్తి రవి మాట్లాడుతూ తెలంగాణ కోసం అనేక రూపాల్లో పోరాడిన ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. ఉద్యమంలో భాగమైన ప్రతి కార్యకర్తకు గుర్తింపు కార్డు, పింఛన్, 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం అమరవీరుల కుటుంబాలను మాత్రమే గుర్తించిందని, ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన అనేక మంది కార్యకర్తలు ఇప్పటికీ ప్రభుత్వ ఫలాలకు దూరంగా ఉన్నారని అన్నారు. అలాంటి వారిని కూడా గుర్తించి సంక్షేమ ఫలాలు అందించాలని కోరారు. జూన్ 21న హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళనానికి పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మూఢనమ్మకాల నిర్మూలన జాతీయ అధ్యక్షుడు బైరి నరేష్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన సింగరేణి పరివాహక జిల్లాల ఉద్యమ నాయకులను ఐక్యం చేసి వేలాది మందితో సమ్మేళనాన్ని విజయవంతం చేస్తామని తెలిపారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం అప్పటి ఉద్యమకారులు తమ యవ్వనం, ఉద్యోగాలు, జీవితాలను త్యాగం చేశారని గుర్తు చేశారు. అలాంటి ఉద్యమకారులందరినీ ప్రజా ప్రభుత్వం గుర్తించి గౌరవించాలని అన్నారు.

**సమ్మేళనం ప్రచార కమిటీ అధ్యక్షుడిగా నిమ్మల వీరన్న**

జూన్ 21న నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళనం ప్రచార కమిటీ అధ్యక్షుడిగా తెలంగాణ ఉద్యమకారులు, సంచార జాతుల రాష్ట్ర అధ్యక్షుడు నిమ్మల వీరన్నను నియమించినట్లు డాక్టర్ పిడమర్తి రవి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండల ప్రదీప్, కన్వీనర్ ఎండి రహీం, డాక్టర్ మీసాల మల్లేష్, బిసగాని శ్రీనివాస్ గౌడ్, డాక్టర్ బొమ్మెర స్టాలిన్, పలస ఆంజనేయులు, బోరెల్లి సురేష్, కుమ్మరి గణేష్, వరలక్ష్మి, చందర్ నాయక్, సంజయ్ గౌడ్, జెర్రిపోతుల సాయన్న, నక్క మహేష్, చాగంటి శేఖర్, మొగిలిగిద్ద ప్రసాద్, జగదీష్, మీసాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసిన వేలేరు మండల నాయకులు

**వేలేరు, మే 12 (తెలంగాణ ముచ్చట్లు):** స్టేషన్‌ఘన్పూర్ నియోజకవర్గ పరిధిలోని వేలేరు మండల కాంగ్రెస్ నాయకులు మంగళవారం రోజున టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. మండల అధ్యక్ష పదవీకాలం ముగియడంతో, గత పది సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి సేవలందించిన వారికి మండల అధ్యక్ష పదవి ఇవ్వాలని వారు వినతి పత్రం సమర్పించారు. దీనికి స్పందించిన మహేష్ కుమార్ గౌడ్, పార్టీ కష్టకాలంలో కృషి చేసిన వారికి తప్పకుండా న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శులు బత్తిని ఎల్ల గౌడ్, కమ్మగాని ప్రభాకర్ గౌడ్, వేలేరు మండల ఉపాధ్యక్షుడు పెద్ది నాగేష్, వేలేరు గ్రామ శాఖ అధ్యక్షుడు జుర్రు సంపత్, పీచర గ్రామ శాఖ అధ్యక్షుడు మంతపురి రాజు, శాలపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు కూరపాటి శంకర్, పీచర కాంగ్రెస్ పార్టీ కాంటెస్టెడ్ సర్పంచ్ జలతారు రేణుక శ్రీనివాస్ పాల్గొన్నారు.



## జై శ్రీరామ్ నినాదాలతో మార్మోగిన పశుపతినాథ్ దేవస్థానం

**ఎల్కతుర్తి, మే 12 (తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని వల్లభాపురం గ్రామంలో గల శ్రీ పశుపతినాథ్ దేవస్థానం (శివాలయం) లో హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోగా, "జై శ్రీరామ్" నినాదాలతో దేవస్థానం పరిసరాలు మారుమోగాయి.

ఈ సందర్భంగా స్వామివారికి రుద్రాభిషేకాలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించగా, అభయాంజనేయ స్వామికి మంత్రోచ్చారణల నడుమ మన్యసూక్త పంచామృత అభిషేక కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు సదానిరంజన్ సిద్ధాంతి తెలిపారు. అనంతరం మహా మంగళహారతి నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

హనుమాన్ జయంతి మంగళవారం రోజున రావడం ఎంతో విశిష్టమైందని, ఈ పవిత్ర దినాన స్వామివారి సేవలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నామని భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని భక్తి గీతాలు ఆలపిస్తూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు.

ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గంజి భావన్ ఋషి, ఆలయ అర్చకులు సదానిరంజన్ సిద్ధాంతి, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు.



## పామిరెడ్డిపల్లిలో అంగరంగ వైభవంగా శ్రీ హనుమాన్ జయంతి వేడుకలు

**పెద్దమందడి,మే12(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామంలో శ్రీ హనుమాన్ జయంతి వేడుకలు రెండు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించారు.రెండో రోజు నిర్వహించిన కార్యక్రమాల్లో ఆంజనేయస్వామికి అభిషేకం, హోమం, పూర్ణాహుతి, చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.ఈ వేడుకల్లో గ్రామ సర్పంచ్ మధిర మంజుల, మండల మాజీ ఎంపీపీ మనేపురెడ్డి సుగుణమ్మ హోమ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.భజన మండలి భక్తులు లక్ష్మారెడ్డి, ఆంజనేయులు, లక్ష్మణ్ గౌడ్, యాదవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేశారు.

# సారంగపల్లి గ్రామంలో పోలీసుల కార్డన్ సర్చ్

- సరైన పత్రాలు లేని వాహనాలు సీజ్
- మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దంటూ హెచ్చరిక
- ప్రజల భద్రతే మా బాధ్యత

**మంచిర్యాల,మే12 (తెలంగాణ ముచ్చట్లు):** మందమర్రి మండలం సారంగపల్లి గ్రామంలో మంగళవారం పోలీసులు కార్డన్ సర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు, గ్రామంలోని ప్రధాన కూడళ్లలో, వీధులలో తిరుగుతూ తనిఖీలు చేపట్టారు, సరైన పత్రాలు లేని 35 ద్విచక్ర వాహనాలు, ఆటోలను స్వాధీనం చేసుకున్నారు, అనంతరం మందమర్రి సిఐ పర్స



రమేష్ మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలను అరికట్టడానికి, ప్రజలకు భద్రత భావాన్ని కల్పించడమే ప్రధాన లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు, వాహనదారులు తప్పకుండా సరైన పత్రాలతో పాటు హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని ఆదేశించారు, అనంతరం సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు, ముఖ్యంగా ఓటీపీలు, అనధికార లింకులు క్లిక్ చేసి సైబర్ వలలో పడొద్దని గుర్తు చేశారు, గ్రామంలో అనుమానిత వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే పోలీసులకు తెలియజేయాలని అన్నారు, అలాగే ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోని పోలీసులకు సహకరించాలని కోరారు, ఈ కార్యక్రమంలో మందమర్రి ఎస్ఐ నరేష్, రామకృష్ణాపూర్ ఎస్సై శ్రీధర్ తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రామన్నపేటలో ఆధ్యాత్మిక వైభవం

**నేడు పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ..**
**హాజరుకానున్న మంత్రి పొంగులేటి**

**ఖమ్మం బ్యూరో, మే 12(తెలంగాణ ముచ్చట్లు ):** ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని 60వ డివిజన్ రామన్నపేట ఆధ్యాత్మిక శోభతో పునీతమైంది. శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయ ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రతి ఇంటి నుంచి మహిళలు జల బిందెలతో తరలివచ్చి అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. పాలాభిషేకాలు,



నదీ స్నానాలు, గ్రామ ఊరేగింపుతో డివిజన్ అంతా భక్తిపారవశ్యంలో మునిగిపోయింది. నేడు పుణ్యఘట్టం.. బుధవారం ఉదయం 9 గంటల 24 నిమిషాలకు వృషభ లగ్న పుష్కరాంశ సుముహూర్తమున పెద్దమ్మ తల్లి, పంచముఖి నాగేంద్రుడు, జంటనాగుల విగ్రహ ప్రతిష్ఠాపన కన్నులపండువగా జరగనుంది. ఈ చారిత్రక వేడుకకు తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. యంత్ర స్థాపన, ప్రాణప్రతిష్ఠాపన అనంతరం భక్తులందరికీ మహా అన్నదానం ఏర్పాటు చేశారు.

# నర్సుల వృత్తి సేవకు ప్రతిరూపం

**పలుస శంకర్ గౌడ్ జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షులు**

**వనపర్తి,మే12(తెలంగాణ ముచ్చట్లు):** ఆస్పత్రుల్లో రోగులకు నర్సులు అందించే సేవ వెలకట్టలేనిదని, నర్సుల వృత్తి సేవకు ప్రతిరూపమని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించిన అంతర్జాతీయ నర్సుల దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.వైద్యులతో పాటు నర్సులు కూడా వైద్యరంగంలో కీలక




పాత్ర పోషిస్తున్నారని, రోగులకు సరైన సమయంలో సేవలు అందిస్తూ కన్నతల్లిలా అండగా నిలుస్తారని కొనియాడారు. ఆస్పత్రుల్లో నర్సుల సేవా దృక్పథం, ప్రవర్తన రోగులపై మంచి ప్రభావం చూపుతుందని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ నర్సులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బైరోజు చంద్రశేఖర్, బండారు శ్రీనివాస్, గంధం నాగరాజు, ప్రొఫెసర్ అరుణకుమారి, సూపరింటెండెంట్ ప్రొఫెసర్ కె.వి. శివప్రసాద్, ఆర్ఎంఓ డాక్టర్ రెడ్డికుమారి, ఆర్ఎంఓ ఇవాంజెలిన్, నర్సింగ్ చీఫ్ సూపరింటెండెంట్ రజినీదేవి, డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్ దైవకృప, విజయలక్ష్మి, సులోచన, భాగ్యలక్ష్మి, మేరీ సుజాత తదితరులు పాల్గొన్నారు.

# చంద్రశేఖర్ కు ఎంపీ రవిచంద్ర నివాళి

**ఖమ్మం బ్యూరో , మే, 12(తెలంగాణ ముచ్చట్లు ):** గాయత్రి గ్రానైట్ కంపెనీ మాజీ మేనేజర్ చంద్ర శేఖర్ సింగ్ (సీ ఎస్ ) కు రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మంగళవారం నివాళులు అర్పించారు. గుండెపోటుతో ఆకస్మికంగా మరణించిన సి ఎస్ మృత దేహాన్ని ఖమ్మం నగర శివారు వెలుగుమట్ల బ్లూ సీ విల్లాలోని ఆయన నివాసం లో ఉంచారు. ఎంపీ రవిచంద్ర, సతీమణి విజయలక్ష్మి, సోదరుడు వద్దిరాజు కిషన్ తదితరులు సీ ఎస్ భౌతిక కాయాన్ని సందర్శించి, పూలమాలతో నివాళులు అర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి ధైర్యం చెప్పి, సానుభూతి ప్రకటించారు. ఎంపీ రవిచంద్ర తో పాటు ప్రముఖులు అర్జెసి కృష్ణ, శాఖమూరి రమేష్, పారా నాగేశ్వరరావు, పారుపల్లి ఉషాకిరణ్, ఇనుగుర్తి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ సింగ్, ఎంపీ రవిచంద్ర తనయులు వద్దిరాజు శ్రీనివాస్, సాయి నిఖిల్, నాగరాజు, కంపెనీ సిబ్బంది తదితరులు చంద్రశేఖర్ కు శ్రద్ధాంజలి ఘటించారు.



# "రైతు కష్టానికి ప్రభుత్వం అండగా నిలవాలి"

**బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే.**

**జమ్మికుంట టౌన్ మే 12 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మండలం వావిలాల-వంతడుపుల గ్రామాల మధ్య విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన భారీ అగ్నిప్రమాదంలో సుమారు 70 ఎకరాల మక్కా పంట పూర్తిగా దగ్ధమై రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. గోపాల్పూర్, వంతడుపుల గ్రామాలకు చెందిన రైతులు కష్టపడి సాగు చేసిన పంట కళ్లముందే అగ్నికి ఆహుతి కావడంతో గ్రామాల్లో విషాద వాతావరణం నెలకొంది.

ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఘటనాస్థలానికి చేరుకుని కాలిపోయిన పంట చేలను పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడి ప్రమాదానికి గల కారణాలు, జరిగిన నష్టం గురించి అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...

"రైతు ఏడిస్తే రాజ్యం బాగుపడదు. కష్టపడి పండించిన పంట ఒక్కసారిగా కాలిపోవడం చాలా బాధాకరం. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలి" అని డిమాండ్ చేశారు.



కన్నీటి పర్యంతమైన రైతులను ఓదార్చిన ఎమ్మెల్యే...

"రైతులు అధైర్యపడొద్దు...మీకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది" అంటూ భరోసా ఇచ్చారు.

వ్యవసాయ శాఖ, విద్యుత్ శాఖ, రెవెన్యూ అధికారులు వెంటనే పూర్తి స్థాయిలో నష్టం అంచనా వేసి జిల్లా అధికారులకు నివేదిక పంపాలని సూచించారు. బాధిత రైతులకు త్వరితగతిన నష్టపరిహారం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అనంతరం మక్కల కొనుగోళ్ల అంశంపై కూడా ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. జమ్మికుంట, హుజూరాబాద్, కమలాపూర్ మార్కెట్ యార్డుల్లో మక్కల కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతోందని విమర్శించారు. 41 కిలోల బదులు 43-45 కిలోల వరకు తూకం వేస్తూ రైతులను మోసం చేస్తున్నారని రైతులు తమ దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు.

కొనుగోలు కేంద్రాల్లో "భరతా" కొరత తీవ్రంగా ఉందని, సరిపడా భరతా అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రైతుబంధు విడుదలలో జాప్యం, సాగునీటి కొరత, కరెంట్ సమస్యలు, యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

"ఎద్దు ఏడిస్తే వ్యవసాయం ఏడుస్తుంది... రైతు ఏడిస్తే రాజ్యం బాగుపడదు" అని మరోసారి గుర్తు చేసిన ఎమ్మెల్యే... రైతులను ఆదుకోవాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం వారిని మరింత కష్టాల్లోకి నెడుతోందని విమర్శించారు.

ఈ పర్యటనలో కేడీసీసీ బ్యాంక్ వైస్ చైర్మన్ పింగిల్ రమేష్, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ములుగు ప్రశాంత్ కుమార్, వైస్ చైర్మన్ జావిద్ అలీ, మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వరరావు, మాజీ ఎంపీపీ పావని వెంకటేష్‌తో పాటు వావిలాల తదితర గ్రామాల రైతులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# శాంతిభద్రతల పరిరక్షణ, అక్రమ పశువుల రవాణాను నిరోధించెందుకు విస్తృత తనిఖీలు..

వైరా ఏసీపీ సారంగపాణి



**ఖమ్మం బ్యూరో, మే 12(తెలంగాణ ముచ్చట్లు ):** బక్రీద్ (ఈద్‌ఉల్‌అధా) పండుగ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు, అక్రమ పశువుల రవాణాను నిరోధించడానికి పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు వైరా డివిజన్ పరిధిలో విస్తృత తనిఖీలతో పోలీసులు కఠిన చర్యలు చేపడుతున్నట్లు వైరా ఏసీపీ సారంగపాణి తెలిపారు. ఖమ్మం కమిషనరేట్ పరిధిలో, అలాగే ప్రధాన హైవేలపై పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేస్తూ...గోవులు, దూడల అక్రమ రవాణాపై నిఘా పెంచామని తెలిపారు. పశువైద్యుల ధ్రువీకరణ పత్రాలు లేకుండా జంతువులను రవాణా చేస్తే జప్తు చేస్తామని పేర్కొన్నారు. గోవధను నిరోధించడానికి, పశువుల అక్రమ రవాణాను అరికట్టడానికి పోలీసు, పశుసంవర్ధక శాఖ సిబ్బందితో కూడిన ఉమ్మడి బృందాలు బోనకల్, మధిర రూరల్, ఎర్రుపాలెం, చింతకాని పోలీస్ స్టేషన్ల పరిధిలో 24/7 తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలిపారు.

జంతువులను రవాణా చేసే వాహనాలపై కఠిన నిఘా ఉంచి, నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అనుమానాస్పద చర్యలు, పశువుల అక్రమ రవాణాపై సమాచారం అందించడానికి పోలీసు కామాండ్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712659111 కు కాల్ చేయవచ్చని అన్నారు.

# హిందూ ఏక్తా యాత్రకు హుజురాబాద్ నుంచి భారీగా తరలిన భక్తులు



**హుజురాబాద్, మే 12(తెలంగాణ ముచ్చట్లు ):** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ పిలుపుమేరకు హనుమాన్ జయంతి సందర్భంగా కరీంనగర్‌లో నిర్వహించిన హిందూ ఏక్తా యాత్రలో పాల్గొనేందుకు హుజురాబాద్ మున్సిపాలిటీ బోర్నపల్లి ప్రాంతం నుంచి బిజెపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలివెళ్లారు.

సనాతన ధర్మ రక్షణ, హిందూ ఐక్యతే లక్ష్యంగా నిర్వహించిన ఈ యాత్రలో పాల్గొన్న వారు "జై శ్రీరామ్" నినాదాలతో ప్రాంతాన్ని మార్మోగించారు. కుల, వర్గ భేదాలు విడిచిపెట్టి హిందూ సమాజం ఒక్కటిగా నిలవాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గంట సంపత్ ఆధ్వర్యంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ధర్మ పరిరక్షణ కోసం ప్రతి హిందువు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# మజ్జిక ప్యాకెట్లు పంచి, మానవత్వం చాటి

**మంచిర్యాల, మే12 (తెలంగాణ ముచ్చట్లు):** మజ్జిగ ప్యాకెట్లను పంచి మానవత్వం చాటారు ట్రాన్స్ జెండర్లు, కోల్ బెల్ట్ లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో మంగళవారం స్థానిక మందమర్రి పాత బస్టాండ్ ఏరియాలో ప్రయాణికులకు ఎండ తీవ్రత నుండి ఉపశమనం కలిగించడానికి హారిక నాయక్ , చరణ్ బృందం ఆధ్వర్యంలో సుమారు 500 మజ్జిగ ప్యాకెట్లను పంచారు, అనంతరం హారిక నాయక్ మాట్లాడుతూ ఈ వేసవిలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రహించి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు, ట్రాన్స్ జెండర్లు చేసిన ఈ యొక్క సేవ భావాన్ని చూసి స్థానికులు అభినందించారు.



# అనారోగ్యంతో మహిళ మృతి.. ముదిరాజ్ సొసైటీ తరపున రూ.10 వేల ఆర్థిక సహాయం

**పెద్దమందడి, మే12(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామానికి చెందిన గొర్రె వెంకటమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. మృతురాలి కుటుంబ సభ్యులను ముదిరాజ్ సొసైటీ నాయకులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా ముదిరాజ్ సొసైటీ తరపున మృతురాలి కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం సమాజ బాధ్యత అని సొసైటీ సభ్యులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అశోక్, గొర్రె కొండన్న, అడివన్న, గొర్రె వెంకటయ్య, గొర్రె సతీష్, గొర్రె కురుమయ్య, మార్చే నాగరాజ్, దండు నరసింహ, దండు యాదగిరి, మార్చే సాయిలు, గొర్రె సత్యన్న పాల్గొన్నారు.



# సోయం గంగులు వర్ధంతి ఘనంగా.!



**స్మారక స్థూపం నిర్మాణానికి చొరవ చూపాలని ఆదివాసీ నాయకుల డిమాండ్.**

**దమ్మపేట, మే 12(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కోయ బొబ్బిలి సోయం గంగులు 75వ వర్ధంతి కార్యక్రమాన్ని దమ్మపేట మండలంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని సోయం గంగులు, కొమరం భీమ్ విగ్రహాలకు అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, ఆదివాసీ నాయకులు సోయం వీరభద్రం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సోయం వీరభద్రం మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో సోయం గంగులు కీలక పాత్ర పోషించారని తెలిపారు. రజాకారులు, భూస్వాములు, జమీందారుల అణచివేతకు వ్యతిరేకంగా ఆదివాసీల హక్కుల కోసం ఆయన పోరాడారని గుర్తుచేశారు. "దున్నేవారికే భూమి" నినాదంతో ఏజెన్సీ ప్రాంతాల్లో సాగిన భూహక్కుల ఉద్యమంలో సోయం గంగులు చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. సోయం గంగులు చరిత్రను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాకు చెందిన ఆదివాసీ ప్రజాప్రతినిధులు ఆయన స్మారక స్థూపం నిర్మాణానికి చొరవ చూపాలని కోరారు. నాయకుల పేర్లను కేవలం ఓట్ల కోసం ఉపయోగించడం తగదని, వారి ఆశయ సాధన కోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు సోయం రామ్మూర్తి, ఉమా మహేశ్వరరావు, కీసరి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

# సుబాబుల్ తోట దగ్ధం

## రూ.3 లక్షల ఆస్తి నష్టం



**ఖమ్మం బ్యూరో, మే 12(తెలంగాణ ముచ్చట్లు ):** ఖమ్మం జిల్లా చింతకాని మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామం, బస్వాపురం రెవెన్యూ పరిధిలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుని సుబాబుల్ తోట పూర్తిగా దగ్ధమైంది. గ్రామానికి చెందిన అడ్వకేట్ కన్నెబోయిన నాగేశ్వరావుకు చెందిన సర్వే నంబర్ 160లో ఉన్న సుమారు ఒక ఎకరం విస్తీర్ణంలోని రెండేళ్ల వయస్సు గల సుబాబుల్ తోట అగ్నికి ఆహుతి అయింది. ఈ ఘటనలో సుమారు రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితుడు తెలిపారు. చుట్టుపక్కల రైతులు చెత్తకు నిప్పంటించడంతో మంటలు వేగంగా వ్యాపించి తోటను చుట్టుముట్టినట్లు తెలుస్తోంది. దూర ప్రాంతం నుంచి వచ్చిన మంటలు ఒక్కసారిగా వ్యాపించడంతో చెట్లు పూర్తిగా కాలిపోయాయి. అగ్ని ప్రమాదం తీవ్రత అధికంగా ఉండటంతో తోట చుట్టూ ఏర్పాటు చేసిన పెన్సింగ్ రాళ్లు కూడా వేడికి పటుత్వం కోల్పోయాయి. కొన్ని రాళ్లు ఇప్పటికే కూలిపోగా, మరికొన్ని ముట్టుకుంటే పడిపోయే పరిస్థితిలో ఉన్నాయని రైతు నాగేశ్వరావు తెలిపారు.

రెండేళ్లుగా ఎంతో శ్రమించి పెంచుకున్న తోట ఒక్కసారిగా దగ్ధమవడంతో తీవ్రంగా నష్టపోయినట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై స్థానిక అధికారులు స్పందించి నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం తరపున తగిన పరిహారం అందించాలని బాధిత రైతు కన్నెబోయిన నాగేశ్వరావు కోరుతున్నారు.



# కాట్రపల్లిలో భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి వేడుకలు

**హుజురాబాద్, మే 12(తెలంగాణ ముచ్చట్లు ):** హనుమాన్ జయంతి సందర్భంగా కాట్రపల్లి గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాములు ఆంజనేయస్వామికి అభిషేకాలు నిర్వహించి చందనం సమర్పించారు. అనంతరం హనుమాన్ నామస్మరణతో ఆలయ ప్రాంగణం భక్తి రసమయంగా మారింది.

భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ చిలుకమారి శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముత్తోజు సాంబశివాచారి, గురుస్వాములు అల్లి జగదీష్, మిడివెల్లి నాగరాజ్, కోమటి శ్రీనివాస్, బొల్ల కరుణాకర్, అక్కిన వేణి అశోక్, తాళ్లపల్లి గణేష్, తొగర్ సంపత్, పెరుమండ్ల సంపత్, కాసగోని కిరణ్, ఏరుకొండ నరసింహస్వామి, తాళ్లపల్లి హరీష్, బాణాల శ్రీనివాస్, వంగ రాములు తదితరులు పాల్గొన్నారు.

అనంతరం స్వాములు ఇరుముడి కట్టుకొని కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దర్శనానికి బయలుదేరారు. "జై హనుమాన్ - జై శ్రీరామ్" నినాదాలతో గ్రామం మార్మోగింది.



# కట్నం కోసం కర్కశంగా ప్రవర్తించిన భర్త.. పోలీసులను ఆశ్రయించిన భార్య

**జమ్మికుంట టౌన్ మే 12 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం నగరం గ్రామానికి చెందిన కవ్వంపల్లి భాగ్యలక్ష్మి భర్త రమేష్‌పై అదనపు కట్న వేధింపులు, దాడి, బెదిరింపుల కేసు నమోదు అయిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. బాధితురాలు భాగ్యలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం, 2012 సంవత్సరంలో నగరం గ్రామానికి చెందిన కవ్వంపల్లి రమేష్‌తో పెద్దలు కుదిర్చిన వివాహం జరిగింది. వివాహ సమయంలో ఆమె తల్లిదండ్రులు రూ.5 లక్షల నగదు, నాలుగు తులాల బంగారం సహా ఇతర లాంఛనాలతో ఘనంగా పెళ్లి జరిపించారు.

రమేష్ సింగరేణిలో ఉద్యోగం చేస్తూ ఉండగా, వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె సంతానం ఉన్నారు. అయితే గత నాలుగు సంవత్సరాలుగా రమేష్ తాగుడుకు బానిసై భార్యను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అదనపు కట్నం తీసుకురావాలని, లేదంటే ఇంటి నుంచి వెళ్లిపోవాలని తరచూ వేధింపులకు గురిచేశాడని బాధితురాలు తెలిపింది.

ఈ విషయాన్ని తన తల్లిదండ్రులకు చెప్పగా, వారు ఈ ఏడాది ఏప్రిల్ 11న రూ.50 వేల నగదును అదనపు కట్నంగా పంపినట్లు వెల్లడించింది. వివాహ సమయంలో ఇచ్చిన నాలుగు తులాల బంగారాన్ని కూడా భర్త కుదువ పెట్టాడని ఆరోపించింది. సమస్యపై నగరం సర్పంచ్ సంపత్ ఆధ్వర్యంలో పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగినప్పటికీ రమేష్ ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదని తెలిపింది.

తాజాగా మే 11న మద్యం సేవించి ఇంటికి వచ్చిన రమేష్, తలుపులు వేసి భార్యను దూషిస్తూ కర్రతో తలపై దాడి చేశాడని, రక్తస్రావం జరుగుతున్నా "ఈ రోజు నిన్ను చంపుతా" అంటూ గదిలో బంధించి బెదిరించాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ప్రజలకు మరింత చేరువగా మున్సిపల్ చైర్మన్



**జమ్మికుంట టౌన్ మే 12 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండేందుకుగాను స్థానిక 23వ వార్డు పాత మార్కెట్ సమీపంలోని పద్మశాలి భవనం పక్కన జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ నూతన కార్యాలయ ప్రారంభ మహోత్సవం రేపు అనగా మే 13వ తేదీ ఉదయం 9:51 గంటలకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యాలయాన్ని హుజూరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. ప్రజలకు మరింత చేరువగా ఉండి వారి సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించేందుకు ఈ కార్యాలయం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా జమ్మికుంట పట్టణ ప్రజలు, వార్డు ప్రజలు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అలాగే ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్



# నిశ్శబ్దంగా పెరుగుతున్న దీర్ఘకాలిక అలసట సమస్య




ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న దీర్ఘకాలిక అలసట సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం మే 12న అంతర్జాతీయ దీర్ఘకాలిక అలసట వ్యాధి అవగాహన దినాన్ని నిర్వహిస్తారు. నిరంతర అలసట, శరీర నొప్పులు, నిద్రలేమి, ఏకాగ్రత లోపం వంటి లక్షణాలతో కనిపించే ఈ సమస్యలు ప్రస్తుతం అనేక మందిని ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. సాధారణ అలసటగా భావించి చాలామంది నిర్లక్ష్యం చేయడం వల్ల పరిస్థితి మరింత తీవ్రమవుతోందని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీర్ఘకాలిక అలసట వ్యాధి అనేది విశ్రాంతి తీసుకున్నా తగ్గని అలసటతో కొనసాగుతుంది. చిన్న పనులు చేసినా శరీరం బలహీనంగా మారడం, రోజువారీ పనులు చేయడంలో ఇబ్బందులు ఎదురుకావడం ఈ వ్యాధి ప్రధాన లక్షణాలుగా గుర్తిస్తున్నారు. కొందరిలో జ్ఞాపకశక్తి తగ్గడం, మానసిక ఒత్తిడి పెరగడం, తలనొప్పి వంటి సమస్యలు కూడా కనిపిస్తున్నాయని వైద్యులు వెల్లడిస్తున్నారు.

ఫైబ్రోమయాల్జియా అనే సమస్య కూడా ప్రస్తుతం అనేక మందిలో పెరుగుతోంది. ఈ వ్యాధిలో కండరాలు, కీళ్ల వద్ద నిరంతర నొప్పి ఉండటంతో పాటు తీవ్రమైన అలసట వేధిస్తుంది. ఎక్కువసేపు పనిచేసినా, తగినంత నిద్రపోయినా శరీరానికి విశ్రాంతి లభించనట్లుగా అనిపిస్తుందని బాధితులు చెబుతున్నారు. మహిళల్లో ఈ సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు.

ప్రస్తుతం ఉద్యోగ ఒత్తిడి, సరైన నిద్ర లేకపోవడం, అసమతుల్య ఆహారం, వ్యాయామం లేకపోవడం వంటి కారణాలు ఈ సమస్యలకు దారితీస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా కంప్యూటర్ల ముందు గంటల తరబడి పనిచేసే ఉద్యోగుల్లో అలసట సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. మానసిక ఒత్తిడి కూడా శరీర ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీర్ఘకాలిక అలసటను చాలామంది సాధారణ సమస్యగా తీసుకోవడం ప్రమాదకరమని వైద్యులు సూచిస్తున్నారు. నిరంతరంగా అలసట, నొప్పులు, నిద్ర సమస్యలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని చెబుతున్నారు. సరైన పరీక్షల ద్వారా సమస్యను గుర్తించి చికిత్స తీసుకుంటే ఉపశమనం పొందే అవకాశం ఉంటుందని వెల్లడిస్తున్నారు.

ఆరోగ్యకరమైన జీవనశైలితో ఈ సమస్యలను కొంతవరకు నియంత్రించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ప్రతిరోజూ సరైన సమయానికి నిద్రపోవడం, పోషకాహారం తీసుకోవడం, వ్యాయామం చేయడం, యోగా, ధ్యానం వంటి అలవాట్లు పాటించడం వల్ల శారీరకంగా, మానసికంగా ఉపశమనం లభిస్తుందని చెబుతున్నారు. నీరు తగినంతగా తాగడం కూడా శరీరానికి అవసరమైన శక్తిని అందించడంలో సహాయపడుతుందని పేర్కొంటున్నారు. అంతర్జాతీయ దీర్ఘకాలిక అలసట వ్యాధి అవగాహన దినం సందర్భంగా పలు ఆరోగ్య సంస్థలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ప్రజల్లో అవగాహన పెంచేందుకు వైద్య శిబిరాలు, సదస్సులు, ఆరోగ్య చర్చలు నిర్వహిస్తున్నారు. శరీరం ఇచ్చే సంకేతాలను నిర్లక్ష్యం చేయకుండా ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.




# యువతలో పెరుగుతున్న గుండెజబ్బులు

ఒకప్పుడు వృద్ధులకు మాత్రమే వచ్చే సమస్యగా భావించిన గుండెజబ్బులు ప్రస్తుతం యువతను కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఇరవై నుంచి నలభై ఏళ్ల మధ్య వయసు ఉన్న వారిలో గుండెపోటులు, అధిక రక్తపోటు, రక్తనాళాల సమస్యలు పెరుగుతున్నాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల యువ ఉద్యోగులు, క్రీడాకారులు ఆకస్మిక గుండెపోటులతో మరణించిన ఘటనలు ప్రజల్లో ఆందోళన పెంచుతున్నాయి. ప్రస్తుతం యువత జీవనశైలి పూర్తిగా మారిపోవడం గుండె ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందని వైద్యులు చెబుతున్నారు. గంటల తరబడి కూర్చుని పని చేయడం, వ్యాయామం చేయకపోవడం, ఫాస్ట్ ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం, సరైన సమయానికి భోజనం చేయకపోవడం వంటి అలవాట్లు గుండెజబ్బులకు దారితీస్తున్నాయని పేర్కొంటున్నారు. ఊబకాయం, అధిక కొలెస్ట్రాల్, మధుమేహం వంటి సమస్యలు కూడా చిన్న వయసులోనే పెరుగుతున్నాయి.

ఉద్యోగ ఒత్తిడి, రాత్రివేళల పని విధానాలు, సరైన నిద్ర లేకపోవడం కూడా యువత ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. మానసిక ఒత్తిడి పెరగడం వల్ల రక్తపోటు అధికమై గుండెపై భారం పడుతోందని హెచ్చరిస్తున్నారు. మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌ల వినియోగం అధికమవడం వల్ల చాలామంది రాత్రిళ్లు ఆలస్యంగా నిద్రపోతున్నారని వైద్యులు పేర్కొంటున్నారు. ధూమపానం, మద్యం సేవించడం వంటి అలవాట్లు కూడా గుండెపోటుల ప్రమాదాన్ని పెంచుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. కుటుంబంలో గుండెజబ్బుల చరిత్ర ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. చిన్న వయసులోనే ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటే ప్రమాదాన్ని ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుందని వెల్లడిస్తున్నారు. ప్రతిరోజూ వ్యాయామం చేయడం, సమతుల ఆహారం తీసుకోవడం, ఒత్తిడిని తగ్గించుకోవడం, సరైన నిద్రపోవడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఫాస్ట్ ఫుడ్ తగ్గించి పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలని చెబుతున్నారు. ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా యువత ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

# మహిళల భద్రతకు సమాజం మొత్తం బాధ్యత వహించాలి



ఒక దేశ అభివృద్ధిని అంచనా వేయాలంటే అక్కడ మహిళలు ఎంత భద్రంగా జీవిస్తున్నారన్న అంశాన్ని పరిశీలిస్తారు. మహిళలు రాత్రి వేళల్లో కూడా భయంలేకుండా బయట తిరగగలిగితేనే ఆ సమాజాన్ని నిజంగా అభివృద్ధి చెందిన సమాజంగా భావిస్తారు. ప్రస్తుతం మహిళలు విద్య, ఉద్యోగం, రాజకీయాలు, విజ్ఞానం, క్రీడలు, వ్యాపారం వంటి అనేక రంగాల్లో అద్భుత విజయాలు సాధిస్తున్నారు. అంతరిక్షం నుంచి అంతర్జాతీయ వేదికల వరకు తమ ప్రతిభను చాటుతున్నారు. అయినప్పటికీ మహిళల భద్రత విషయంలో ఇంకా అనేక సమస్యలు కొనసాగుతుండటం ఆందోళన కలిగించే అంశంగా మారింది. ప్రతి రోజు ఎక్కడో ఒకచోట మహిళలపై వేధింపులు, దాడులు, మానసిక హింస, సైబర్ నేరాలు, గృహ హింస వంటి ఘటనలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. ఇది కేవలం చట్టపరమైన సమస్య కాదు, సమాజ ఆలోచనా విధానానికి సంబంధించిన సమస్యగా కూడా చూడాల్సిన అవసరం ఉంది.

మహిళల భద్రత అనగానే చాలా మంది కేవలం పోలీసు వ్యవస్థను మాత్రమే గుర్తు చేసుకుంటారు. కానీ నిజానికి మహిళల భద్రత కుటుంబం నుంచి ప్రారంభమవుతుంది. చిన్నప్పటి నుంచే అబ్బాయిలకు మహిళలను గౌరవించడం నేర్పించాలి. అమ్మాయిలను బలహీనులుగా చూడకుండా సమాన హక్కులు కలిగిన వ్యక్తులుగా గుర్తించే సంస్కారం పెంపొందించాలి. కుటుంబాల్లోనే లింగ వివక్ష కొనసాగితే భవిష్యత్తులో సమాజంలో పెద్ద మార్పు ఆశించడం కష్టం. కొన్నిచోట్ల ఇప్పటికీ అమ్మాయిల అభిప్రాయాలను పట్టించుకోకపోవడం, వారి స్వేచ్ఛను పరిమితం చేయడం, చదువు లేదా ఉద్యోగ అవకాశాల్లో తేడాలు చూపించడం జరుగుతూనే ఉన్నాయి. ఈ పరిస్థితులు మారకపోతే మహిళల సాధికారత పూర్తిగా సాధ్యం కాదు.

ప్రస్తుతం సాంకేతికత అభివృద్ధి చెందుతున్నకొద్దీ మహిళలపై నేరాల రూపాలు కూడా మారుతున్నాయి. సామాజిక మాధ్యమాల ద్వారా వేధింపులు, నకిలీ ఖాతాలతో బెదిరింపులు, వ్యక్తిగత ఫోటోల దుర్వినియోగం, అసభ్య సందేశాలు వంటి సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. అనేక మంది మహిళలు ఈ సమస్యలను బయటకు చెప్పేందుకు కూడా భయపడుతున్నారు. సమాజంలో అపోహలు, విమర్శలు ఎదురవుతాయనే భయంతో మౌనంగా బాధపడుతున్నారు. సైబర్ భద్రతపై మహిళలకు సరైన అవగాహన కల్పించడం అత్యంత అవసరం. అలాగే ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. మహిళలపై జరిగే నేరాల్లో చాలా వరకు పరిచయం ఉన్నవారే నిందితులుగా ఉండటం మరింత ఆందోళన కలిగించే విషయం. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు లేదా పరిచయస్తుల నుంచి కూడా మహిళలు హింసను ఎదుర్కొంటున్న ఘటనలు బయటపడుతున్నాయి. దీనివల్ల మహిళల్లో మానసిక భయం పెరుగుతోంది. ఒక మహిళ తనకు తెలిసిన వ్యక్తుల మధ్య కూడా భద్రంగా లేకపోతే అది సమాజ వైఫల్యంగా భావించాల్సిందే. అందుకే మహిళలకు రక్షణ కల్పించడం కేవలం బయట ప్రపంచానికి మాత్రమే పరిమితం కాకుండా కుటుంబ స్థాయిలో కూడా ప్రారంభమవ్వాలి. చట్టాలు ఎంత కఠినంగా ఉన్నా అమలు బలంగా లేకపోతే ఆశించిన ఫలితం ఉండదు. మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులు సంవత్సరాల పాటు కొనసాగడం వల్ల బాధితులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. త్వరితగతిన న్యాయం అందించే వ్యవస్థ బలపడాలి. బాధితులపై అనుమానంతో కాకుండా వారికి మద్దతుగా వ్యవహరించే విధానం అవసరం. కొన్నిసార్లు బాధితులనే ప్రశ్నించే పరిస్థితులు కనిపిస్తాయి. వారి దుస్తులు, బయటకు వెళ్లిన సమయం, మాట్లాడే తీరు వంటి అంశాలను కారణాలుగా చూపడం తప్పు. తప్పు చేసిన వ్యక్తినే బాధ్యుడిగా చూడాలి. విద్యాసంస్థలు మహిళల భద్రతపై అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషించాలి. పాఠశాలలు, కళాశాలల్లో చిన్నప్పటి నుంచే లింగ సమానత్వం, పరస్పర గౌరవం, మంచి ప్రవర్తన వంటి విలువలను బోధించాలి. కేవలం పుస్తక విద్య మాత్రమే కాకుండా సామాజిక బాధ్యతను కూడా విద్యలో భాగం చేయాలి. విద్యార్థుల్లో మంచి ఆలోచనలు పెరిగితే భవిష్యత్తులో సమాజంలో నేరాల సంఖ్య తగ్గే అవకాశం ఉంటుంది. మహిళలను గౌరవించడం ఒక సంస్కారంగా మారాలి. ఉద్యోగ ప్రాంతాల్లో కూడా మహిళల భద్రతకు పెద్దపీట వేయాల్సిన అవసరం ఉంది. అనేక మహిళలు రాత్రి పూట విధులు నిర్వహిస్తున్నారు. అలాంటి సమయంలో రవాణా, భద్రత, అత్యవసర సహాయం వంటి అంశాల్లో సంస్థలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. కార్యాలయాల్లో వేధింపుల నివారణ కమిటీలు పేరుకే కాకుండా సమర్థంగా పనిచేయాలి. ఉద్యోగ అవకాశాలు పెరగడం మహిళల అభివృద్ధికి మంచి సూచన అయినప్పటికీ భద్రతా లోపాలు ఉంటే వారి పురోగతికి ఆటంకాలు ఏర్పడతాయి. ప్రజా రవాణా వ్యవస్థలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు కూడా తక్కువ కావు. బస్సులు, రైళ్లు, మెట్రో స్టేషన్లు, బహిరంగ ప్రదేశాల్లో వేధింపుల ఘటనలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. సీసీ కెమెరాలు, అత్యవసర సహాయ కేంద్రాలు, ప్రత్యేక భద్రతా సిబ్బంది వంటి చర్యలు మరింత బలపడాలి. మహిళలు ఎక్కడ ఉన్నా వారికి భద్రత కల్పించే విధంగా నగరాల ప్రణాళిక ఉండాలి. ఒక మహిళ స్వేచ్ఛగా ప్రయాణించలేకపోతే ఆ సమాజం ఇంకా పూర్తి అభివృద్ధి సాధించలేదని అర్థం. మహిళల భద్రత విషయంలో సామాజిక మాధ్యమాలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. మహిళలపై అసభ్య ప్రచారం, తప్పుడు వార్తలు, వ్యక్తిత్వ హననానికి దారితీసే పోస్టులు పెరుగుతున్నాయి. వినోదం పేరుతో మహిళలను అవమానించే కంటెంట్ కూడా సమాజంపై చెడు ప్రభావం చూపుతోంది. మీడియా, సినిమా, సామాజిక మాధ్యమాలు మహిళలను గౌరవించే దిశగా బాధ్యతాయుత పాత్ర పోషించాలి. సమాజం చూసే విషయాలు మనుషుల ఆలోచనలను ప్రభావితం చేస్తాయని గుర్తించాలి. మహిళల భద్రత అనేది కేవలం మహిళల సమస్య కాదు. అది ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తి, ప్రతి సమాజానికి సంబంధించిన అంశం. మహిళలు భయంలేకుండా జీవించే పరిస్థితులు ఏర్పడితేనే నిజమైన సమానత్వం సాధ్యమవుతుంది. చట్టాలు, శిక్షలు, భద్రతా వ్యవస్థలు అవసరమే అయినప్పటికీ మనుషుల ఆలోచనల్లో మార్పు రావడం మరింత ముఖ్యమైన విషయం. ఒక మహిళను గౌరవించడం అంటే ఒక కుటుంబాన్ని, ఒక సమాజాన్ని గౌరవించినట్లే. మహిళల భద్రతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతగా మారినప్పుడే సురక్షితమైన, సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# నర్సులకు రాష్ట్రపతి పురస్కారాలు

అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా సత్కారం

ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డుల ప్రదానం

సేవాభావానికి రాష్ట్రపతి ప్రశంసలు



అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా విశిష్ట సేవలు అందించిన నర్సింగ్ సిబ్బందికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతీయ ఫ్లోరెన్స్ నైటింగేల్ పురస్కారాలను ప్రదానం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డులను అందజేశారు. ఆరోగ్య రంగంలో నిస్వార్థ సేవలు అందిస్తూ ప్రజల ప్రాణాలను కాపాడుతున్న నర్సింగ్ సిబ్బంది సేవలను రాష్ట్రపతి ఈ సందర్భంగా కొనియాడారు. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో కూడా నర్సులు అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ నాణ్యమైన వైద్య సేవలను అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో నర్సింగ్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. సేవా దృక్పథం, సహనం, మానవత్వానికి నర్సులు ప్రతీకలుగా నిలుస్తున్నారని అన్నారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితులు, విపత్తుల సమయంలో వారి సేవలు దేశానికి ఎంతో అవసరమవుతున్నాయని వివరించారు.

జాతీయ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డులు వైద్య రంగంలో విశిష్ట సేవలు అందించిన నర్సులకు ఇచ్చే అత్యున్నత గౌరవాల్లో ఒకటిగా భావిస్తారు. గ్రామీణ ప్రాంతాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, అత్యవసర వైద్య సేవల్లో విశేష కృషి చేసిన నర్సింగ్ సిబ్బందిని ఈ పురస్కారాలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య శాఖకు చెందిన ఉన్నతాధికారులు, వైద్య రంగ నిపుణులు, నర్సింగ్ ప్రతినిధులు పాల్గొన్నారు. అవార్డు గ్రహీతలను పలువురు అభినందించారు. దేశ ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో నర్సుల పాత్ర మరింత కీలకమవుతోందని నిపుణులు పేర్కొన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా పలు ఆసుపత్రుల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజల ఆరోగ్య రక్షణలో నిరంతరం సేవలందిస్తున్న నర్సింగ్ సిబ్బందికి వివిధ వర్గాల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# సరిహద్దు కంచెపై ఢాకా స్పందన

బెంగాల్ నిర్ణయంపై చర్చ

"ముళ్ల తీగలకు భయం లేదు"

ద్వైపాక్షిక సంబంధాలపై ఆసక్తి



పశ్చిమ బెంగాల్‌లో సువేందు అధికారి నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తీసుకున్న సరిహద్దు రక్షణ చర్యలు ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో చర్చకు దారితీశాయి. భారత్‌బంగ్లాదేశ్ సరిహద్దుల్లో ముళ్లకంచె నిర్మాణం కోసం సరిహద్దు భద్రతా దళానికి భూమి కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై బంగ్లాదేశ్ తాజాగా స్పందించింది. బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ సలహాదారు ఎం.హెచ్. కబీర్ మాట్లాడుతూ, "ముళ్ల తీగలకు ఢాకా భయపడదు" అని వ్యాఖ్యానించారు. తమ దేశ జాతీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భారత్ అంతర్గత రాజకీయాల్లో జోక్యం చేసుకునే ఉద్దేశం తమకు లేదని, తమ సంబంధాలు ప్రధానంగా కేంద్ర ప్రభుత్వంతోనే కొనసాగుతాయని తెలిపారు.

ఇరు దేశాల మధ్య కొన్ని సవాళ్లు ఉన్నప్పటికీ ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరిచే దిశగా నాయకత్వం కట్టుబడి ఉందని కబీర్ పేర్కొన్నారు. వాణిజ్యం, భద్రత, సరిహద్దు సమస్యలు వంటి అంశాల్లో పరస్పర సహకారం కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఇరు దేశాలు పరిస్థితిని జాగ్రత్తగా గమనిస్తున్నట్లు దౌత్య వర్గాలు చెబుతున్నాయి. భారతీయ జనతా పార్టీ ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన హామీ మేరకు సరిహద్దు కంచె నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేస్తోంది. అధికారంలోకి వచ్చిన 45 రోజుల్లోనే నిర్మాణ పనులను పూర్తి చేస్తామని పార్టీ ప్రకటించింది. ముఖ్యమంత్రి సువేందు అధికారి తొలి మంత్రివర్గ సమావేశంలోనే సరిహద్దు భద్రతా దళానికి అవసరమైన భూమి కేటాయింపునకు ఆమోదం తెలిపారు.

అక్రమ చొరబాట్లు, స్మగ్లింగ్ కార్యకలాపాలను అరికట్టడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. సరిహద్దు భద్రతను మరింత బలోపేతం చేయడం ద్వారా రాష్ట్రంలో శాంతిభద్రతలు మెరుగుపడతాయని అధికార వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు ఈ నిర్ణయం పొరుగు దేశంతో సంబంధాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్న అంశంపై రాజకీయ, దౌత్య వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. సరిహద్దు ప్రాంతాల్లో ఇప్పటికే భద్రతా చర్యలు కట్టుదిట్టం చేసినట్లు సమాచారం. కంచె నిర్మాణం పూర్తయితే అక్రమ వలసలు, అక్రమ రవాణాపై గణనీయమైన నియంత్రణ సాధ్యమవుతుందని భద్రతా నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ అంశం భవిష్యత్తులో భారత్‌బంగ్లాదేశ్ సంబంధాల్లో కొత్త చర్చలకు దారితీసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# మహిళల ఫ్రీ బస్సుపై ఆందోళన

ప్రైవేటు బస్సుల భయం

యూడీఎఫ్‌పై ఒత్తిడి

సీఎం ఎంపికలో గందరగోళం



కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి విజయం సాధించిన తర్వాత ఆ పార్టీ ప్రకటించిన హామీలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ప్రధాన చర్చగా మారాయి. ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించే ప్రతిపాదనపై విస్తృత చర్చ కొనసాగుతోంది. ఈ పథకం అమలైతే తమ రంగం తీవ్ర సంక్షోభంలో పడే అవకాశం ఉందని ప్రైవేటు బస్సు యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఆల్ కేరళ బస్ ఆపరేటర్స్ సంఘం ప్రధాన కార్యదర్శి గోపినాథన్ మాట్లాడుతూ, కేఎస్‌ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తే మహిళా ప్రయాణికులంతా ప్రభుత్వ బస్సుల వైపే మళ్లే అవకాశముందని అన్నారు. దాంతో ప్రైవేటు బస్సులకు వచ్చే ఆదాయం భారీగా తగ్గిపోతుందని తెలిపారు. ఇప్పటికే డీజిల్ ధరలు, నిర్వహణ ఖర్చులు, పన్నుల భారంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రైవేటు రవాణా రంగానికి ఈ నిర్ణయం మరింత భారంగా మారుతుందని చెప్పారు.

ప్రైవేటు బస్సులపై ఆధారపడి వేలాది మంది డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది జీవనం సాగిస్తున్నారని ఆపరేటర్లు పేర్కొన్నారు. ఒకవేళ ప్రయాణికుల సంఖ్య తగ్గిపోతే బస్సుల నిర్వహణ కష్టమై, అనేక సర్వీసులు నిలిచిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేటు బస్సులే ప్రధాన రవాణా సౌకర్యంగా ఉన్నాయని, ఆ రంగం దెబ్బతింటే ప్రజలకే ఇబ్బందులు తలెత్తుతాయని వివరించారు. ఈ పథకాన్ని అమలు చేసే ముందు ప్రభుత్వం సంబంధిత వర్గాలతో చర్చలు జరపాల్సిందని ప్రైవేటు బస్సు యాజమాన్యాలు డిమాండ్ చేస్తున్నాయి. రవాణా రంగంలోని అన్ని వర్గాల అభిప్రాయాలు తెలుసుకుని నిర్ణయం తీసుకుంటే మంచిదని సూచించాయి. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం తప్పు కాదని, కానీ దాని ప్రభావం ప్రైవేటు రంగంపై పడకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాయి. ఇదిలా ఉండగా, మహిళా ప్రయాణికుల సంఖ్యను అంచనా వేయడానికి ప్రత్యేక విధానాన్ని అమలు చేస్తున్నట్లు సమాచారం. బస్సుల్లో మహిళలకు, పురుషులకు వేర్వేరుగా టికెట్లు జారీ చేస్తూ ప్రయాణికుల గణాంకాలను సేకరిస్తున్నారని తెలుస్తోంది. భవిష్యత్తులో పథకం అమలుకు అవసరమైన ఖర్చు, ప్రయాణికుల సంఖ్య వంటి అంశాలను అంచనా వేయడానికి ఈ ప్రక్రియ ఉపయోగపడుతుందని అధికారులు భావిస్తున్నారు.

అయితే ఇప్పటివరకు యూడీఎఫ్ అధికారికంగా ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. ముఖ్యమంత్రి ఎంపికపై పార్టీలో అంతర్గత చర్చలు కొనసాగుతున్నాయి. సీఎం పదవి కోసం పలువురు సీనియర్ నేతలు పోటీలో ఉన్నారని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వం ఏర్పాటు పూర్తైన తర్వాతే ఉచిత బస్సు పథకంపై స్పష్టత వచ్చే అవకాశముందని భావిస్తున్నారు. మహిళల ఆర్థిక భారం తగ్గించేందుకు ఉచిత ప్రయాణ పథకం ఉపయోగపడుతుందని కొందరు అభిప్రాయపడుతుండగా, మరోవైపు ప్రైవేటు రవాణా రంగాన్ని కూడా కాపాడాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. దీంతో ప్రభుత్వం తీసుకునే తుది నిర్ణయం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తికరంగా మారింది.

# నీట్ యూజీ పరీక్ష రద్దు

పేపర్ లీక్ ఆరోపణలు

కొత్త తేదీలు త్వరలో

సీబీఐ విచారణకు రంగం సిద్ధం



దేశవ్యాప్తంగా వైద్య విద్యా ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యూజీ 2026 పరీక్షను రద్దు చేస్తున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటించింది. మే 3వ తేదీన నిర్వహించిన ఈ పరీక్షలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. కొత్త పరీక్ష తేదీలను త్వరలో ప్రకటించనున్నట్లు తెలిపింది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 552 నగరాల్లో పాటు 14 అంతర్జాతీయ కేంద్రాల్లో నీట్ యూజీ పరీక్ష నిర్వహించారు. సుమారు 20 లక్షల మందికి పైగా విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. అయితే పరీక్ష ప్రారంభానికి ముందే ప్రశ్నపత్రానికి సంబంధించిన ప్రశ్నలు సోషల్ మీడియాలో, కొన్ని గ్రూపుల్లో చక్కర్లు కొట్టినట్లు ఆరోపణలు వచ్చాయి. విద్యార్థులు పరీక్షలో చూసిన ప్రశ్నలతో పోలిన దాదాపు 100 ప్రశ్నలు ముందుగానే బయటకు వచ్చినట్లు ప్రచారం జరిగింది.

పేపర్ లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. ముఖ్యంగా రాజస్థాన్‌లో ఈ అంశంపై పెద్ద ఎత్తున ఆరోపణలు రావడంతో అక్కడి పోలీసులు విచారణ ప్రారంభించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు కూడా రంగంలోకి దిగాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం పరీక్ష నిర్వహణలో కొన్ని అవకతవకలు జరిగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలోనే విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పరీక్షను పూర్తిగా రద్దు చేయాలని ఎన్‌టీఏ నిర్ణయించినట్లు తెలుస్తోంది. పరీక్ష వ్యవస్థపై నమ్మకం నిలబెట్టేందుకు పారదర్శకంగా తిరిగి పరీక్ష నిర్వహిస్తామని అధికారులు చెబుతున్నారు. దేశవ్యాప్తంగా సమాన అవకాశాలు కల్పించేందుకు ఈ చర్యలు అవసరమయ్యాయని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, పరీక్ష రద్దుతో విద్యార్థులు ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. ఇప్పటికే నమోదు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపింది. అదనపు పరీక్ష ఫీజు కూడా చెల్లించాల్సిన అవసరం ఉండదని వెల్లడించింది. ప్రస్తుతం ఉన్న రిజిస్ట్రేషన్ వివరాలు, పరీక్ష కేంద్రాలను యథావిధిగా కొనసాగించనున్నట్లు పేర్కొంది. అలాగే గతంలో విద్యార్థులు చెల్లించిన ఫీజులను తిరిగి రిఫండ్ చేయనున్నట్లు ఎన్‌టీఏ ప్రకటించింది. ఈ ప్రక్రియపై త్వరలో పూర్తి వివరాలు వెల్లడించనున్నట్లు తెలిపింది.

మరోవైపు ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు కోసం కేసును సీబీఐకి అప్పగించే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు సమాచారం. నీట్ పరీక్ష రద్దు వార్తతో దేశవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. నెలల తరబడి కష్టపడి పరీక్ష రాసిన విద్యార్థులు మళ్లీ పరీక్షకు సిద్ధం కావాల్సి రావడంతో మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. అయితే పరీక్షలో న్యాయం జరగాలంటే కఠిన చర్యలు తప్పవని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

# రెండోసారి సీఎంగా హిమంత



అస్సాంలో మళ్లీ ఎన్డీఏ ప్రభుత్వం

ఘనంగా ప్రమాణ స్వీకారం

మోదీ సహా పలువురు హాజరు




అస్సాం ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వ శర్మ మరోసారి ప్రమాణ స్వీకారం చేశారు. వరుసగా రెండోసారి ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్ర గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య హిమంత బిశ్వ శర్మ చేత ప్రమాణ స్వీకారం చేయించారు. గౌహతిలో జరిగిన ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీఏ కూటమి నేతలు హాజరయ్యారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు భారీగా పాల్గొన్నారు. అస్సాంలో వరుసగా మూడోసారి ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

హిమంత బిశ్వ శర్మతో పాటు పలువురు మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం చేశారు. భారతీయ జనతా పార్టీ నేత రామేశ్వర్ తేలి మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. కూటమి భాగస్వామ్య పార్టీలైన అసోం గణ పరిషత్‌కు చెందిన అతుల్ బోరా, బోడోలాండ్ పీపుల్స్ ఫ్రంట్ నేత చరణ్ బోరాలు కూడా మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కొత్త మంత్రివర్గంలో ప్రాంతీయ సమతుల్యతకు ప్రాధాన్యం ఇచ్చినట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల జరిగిన అస్సాం అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించింది. మొత్తం 126 స్థానాలున్న అసెంబ్లీలో ఎన్డీఏ కూటమి 102 స్థానాలను కైవసం చేసుకుంది. అందులో భారతీయ జనతా పార్టీ ఒక్కటే 82 స్థానాల్లో విజయం సాధించింది. కూటమి భాగస్వామ్య పార్టీలైన అసోం గణ పరిషత్, బోడోలాండ్ పీపుల్స్ ఫ్రంట్ చెరో పది స్థానాలు గెలుచుకున్నాయి.

ఎన్నికల ఫలితాల తర్వాత హిమంత బిశ్వ శర్మనే మరోసారి ముఖ్యమంత్రిగా కొనసాగించాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించింది. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతుల విస్తరణ, శాంతిభద్రతల పరిరక్షణ అంశాలు ప్రజల్లో మంచి స్పందన తెచ్చాయని పార్టీ నేతలు పేర్కొంటున్నారు. రెండోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన హిమంత బిశ్వ శర్మ రాష్ట్ర అభివృద్ధికి మరింత కృషి చేస్తానని తెలిపారు. ప్రజల సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాలు, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని వెల్లడించారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో అస్సాంలో రాజకీయంగా కొత్త దశ ప్రారంభమైందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# హెరిటేజ్ లాభాల్లో తగ్గుదల

హెరిటేజ్ ఫుడ్స్ నాలుగో త్రైమాసిక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. సంస్థ మొత్తం ఆదాయం రూ.1157.56 కోట్లుగా నమోదై గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే పది శాతం వృద్ధిని నమోదు చేసింది. అయితే ఆదాయం పెరిగినప్పటికీ నికర లాభం మాత్రం గణనీయంగా తగ్గింది.

గత ఏడాది రూ.38.16 కోట్లుగా ఉన్న నికర లాభం, ఈసారి రూ.23.94 కోట్లకు పడిపోయింది. దీనికి ప్రధాన కారణం వ్యయాలు భారీగా పెరగడమేనని సంస్థ వెల్లడించింది. పాల సేకరణ ఖర్చులు పెరగడం, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, దేశవ్యాప్తంగా నెలకొన్న పాల కొరత డెయిరీ రంగంపై తీవ్ర ప్రభావం చూపాయని సంస్థ కార్యనిర్వాహక సంచాలకురాలు నారా బ్రాహ్మణి తెలిపారు. వ్యయాలు రూ.990 కోట్ల నుంచి రూ.1132 కోట్లకు పెరగడంతో లాభాల మార్జిన్లపై తీవ్ర ఒత్తిడి ఏర్పడిందని సంస్థ పేర్కొంది. ఇదే సమయంలో షేర్ మార్కెట్‌లో కూడా హెరిటేజ్ షేర్లు ఒడిదుడుకులకు లోనవుతున్నాయి.

మే 11న ఆర్థిక ఫలితాల వెల్లడికి ముందు కంపెనీ షేరు ధర 4.33 శాతం లాభంతో రూ.378.30 వద్ద ముగిసింది. అయితే గతంలో నమోదైన గరిష్ట స్థాయితో పోలిస్తే ప్రస్తుతం షేరు విలువ భారీగా పడిపోయింది. 2024 ఎన్నికల ఫలితాల సమయంలో రూ.727 వరకు చేరిన షేరు, అక్కడి నుంచి దాదాపు అరవై శాతం విలువ కోల్పోయింది. గత ఆరు నెలల్లోనే ఇరవై శాతం పతనం కావడం గమనార్హం. ప్రస్తుతం సంస్థ మార్కెట్ విలువ రూ.3.51 వేల కోట్లుగా ఉంది. భవిష్యత్తులో వృద్ధిని సాధించేందుకు శామీర్‌పేటలో కొత్త ఐస్‌క్రీం తయారీ కేంద్రాన్ని ప్రారంభించినట్లు యాజమాన్యం తెలిపింది. 1992లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్థాపించిన ఈ సంస్థ ప్రస్తుతం ఆయన కుటుంబ సభ్యుల పర్యవేక్షణలో కొనసాగుతోంది. నారా భువనేశ్వరి ఉపాధ్యక్షురాలిగా, నారా బ్రాహ్మణి కార్యనిర్వాహక సంచాలకురాలిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఢిల్లీ వంటి ప్రాంతాల్లో హెరిటేజ్ తన వ్యాపారాన్ని విస్తరించింది. పాలు మాత్రమే కాకుండా పెరుగు, నెయ్యి, పనీర్, రుచికర పాలు వంటి విలువ ఆధారిత ఉత్పత్తులపై సంస్థ ఎక్కువగా దృష్టి సారిస్తోంది.

వాతావరణ పరిస్థితులు అనుకూలించి పాల సేకరణ ధరలు తగ్గితే, రాబోయే త్రైమాసికాల్లో సంస్థ మళ్లీ లాభాల బాట పట్టే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఇంధన ధరలపై ఆందోళన




దేశంలో పెట్రోలియం ఉత్పత్తులకు ఎలాంటి కొరత లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభ పరిస్థితుల నేపథ్యంలో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా పెరుగుతున్నప్పటికీ, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపింది.

ప్రధాని నరేంద్ర మోదీ ఇంధన పొదుపుపై ప్రజలకు పిలుపునిచ్చిన మరుసటి రోజే కేంద్రం ఈ కీలక ప్రకటన చేసింది. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు పెరిగినా, ఆ భారాన్ని ప్రజలపై మోపకుండా ప్రభుత్వ రంగ చమురు సంస్థలు రోజుకు దాదాపు వెయ్యి కోట్ల రూపాయల నష్టాన్ని భరిస్తున్నాయని వెల్లడించింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన మంత్రుల కమిటీ సమావేశంలో దేశంలో అరవై రోజులకు సరిపడా ముడి చమురు నిల్వలు, నలభై ఐదు రోజులకు సరిపడా వంటగ్యాస్ నిల్వలు ఉన్నాయని అధికారులు తెలిపారు. అలాగే దేశ విదేశీ మారక నిల్వలు 703 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉండటం ఊరటనిచ్చే అంశమని పేర్కొన్నారు. అయితే అంతర్జాతీయ ధరల పెరుగుదల దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతోందని, ఇంధన పొదుపు ద్వారా ఈ భారాన్ని కొంత మేర తగ్గించవచ్చని ప్రభుత్వం అభిప్రాయపడింది. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువుల వినియోగాన్ని తగ్గించాలని, అనవసర విదేశీ మారక వ్యయాన్ని నియంత్రించాలని ప్రధాని మోదీ మరోసారి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రధాని వ్యాఖ్యలపై విపక్షాలు తీవ్ర విమర్శలు గుప్పించాయి. రాహుల్ గాంధీ మాట్లాడుతూ, ఇది కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఆరోపించారు. జైరాం రమేశ్ ఇంధన ధరల పెంపునకు కేంద్రం రంగం సిద్ధం చేస్తోందని విమర్శించారు. అలాగే అఖిలేశ్ యాదవ్ ఎన్నికల తర్వాతే ఈ సంక్షోభం ఎందుకు గుర్తుకొచ్చిందని ప్రశ్నించగా, తేజస్వి యాదవ్ బంగారం కొనవద్దని ప్రజలకు చెప్పడం విచిత్రంగా ఉందంటూ ఎద్దేవా చేశారు.

ప్రధాని పిలుపు ప్రభావంతో సోమవారం దేశీయ స్టాక్ మార్కెట్లు భారీగా పతనమయ్యాయి. రూపాయి విలువ కూడా చారిత్రక కనిష్ట స్థాయికి చేరింది. అయితే ఈ విమర్శలకు ప్రతిస్పందించిన భారతీయ జనతా పార్టీ, దేశ ప్రయోజనాల దృష్ట్యా తీసుకున్న చర్యలేనని పేర్కొంది. గతంలో మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కూడా ఇలాంటి పిలుపునిచ్చారని గుర్తు చేసింది.

# విద్యుత్ బస్సుల తయారీలో కొత్త అడుగు




విద్యుత్ బస్సుల తయారీ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునేందుకు డసో సిస్టమ్స్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది.

ఈ ఒప్పందంలో భాగంగా డసో సిస్టమ్స్‌కు చెందిన త్రిమితీయ అనుభవ వేదికను ఒలెక్ట్రా వినియోగించుకోనుంది. విద్యుత్ రవాణా రంగంలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి స్థాయిలో ఉత్పత్తుల అభివృద్ధికి ఈ వేదిక ఉపయోగపడనుందని సంస్థ తెలిపింది. ఇంజినీరింగ్ ఆధారిత వర్చువల్ ప్రతిరూప సాంకేతిక నైపుణ్యాల సహాయంతో వాహనాల రూపకల్పన, అభివృద్ధి ప్రక్రియ మరింత మెరుగుపడనుందని ఒలెక్ట్రా వెల్లడించింది.

ఈ భాగస్వామ్యంతో ఆధునిక సాంకేతికత ఆధారంగా నూతన నమూనాల విద్యుత్ బస్సులను రూపొందించే అవకాశాలు పెరుగుతాయని, ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఉత్పత్తులను అందించడంలో ఇది కీలకంగా మారనుందని సంస్థ అభిప్రాయపడింది.



# వృద్ధులకు ఆరోగ్య బీమా ఎందుకు అవసరం?

అరవై సంవత్సరాలు దాటిన వృద్ధుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఆరోగ్య బీమా పథకాలు ప్రస్తుతం ఎంతో అవసరంగా మారుతున్నాయి. వయస్సు పెరిగే కొద్దీ అనారోగ్య సమస్యలు ఎక్కువయ్యే అవకాశం ఉండటంతో పాటు వైద్య ఖర్చులు కూడా భారీగా పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో సరైన ఆరోగ్య బీమా పాలసీ ఉంటే చికిత్స ఖర్చుల భారం తగ్గడమే కాకుండా కుటుంబానికి ఆర్థిక భరోసా కూడా లభిస్తుంది.

వృద్ధుల కోసం తీసుకునే ఆరోగ్య బీమా కేవలం ఒక ఆర్థిక పథకం మాత్రమే కాదు. అనారోగ్య సమయంలో కుటుంబం ఎన్నో ఏళ్లుగా కూడబెట్టుకున్న పొదుపులను కాపాడే రక్షణ కవచంగా కూడా పనిచేస్తుంది. అందుకే పాలసీ తీసుకునే ముందు అందులోని అన్ని నిబంధనలను పూర్తిగా చదవడం చాలా ముఖ్యం అని నిపుణులు సూచిస్తున్నారు.

పాలసీలో సహభారం నిబంధన ఉందా లేదా, గది అద్దె పరిమితి ఎంత వరకు ఉంది, మోకాలి మార్పిడి లేదా గుండె శస్త్రచికిత్స వంటి ఖరీదైన చికిత్సలకు ప్రత్యేక పరిమితులు ఉన్నాయా అనే విషయాలను ముందుగానే తెలుసుకోవాలి. ఉదాహరణకు రోజుకు మూడు వేల రూపాయల గది అద్దె పరిమితి ఉన్న పాలసీ తీసుకుని, ఆసుపత్రిలో గది అద్దె ఏడు వేల రూపాయలు అయితే, మిగతా చికిత్స ఖర్చులు కూడా అదే నిష్పత్తిలో తగ్గించే అవకాశం ఉంటుంది.

అందుకే అరవై ఏళ్లు దాటిన తల్లిదండ్రుల కోసం ఆరోగ్య బీమా తీసుకునే ముందు వాస్తవ వైద్య అవసరాలను దృష్టిలో పెట్టుకుని పాలసీని ఎంపిక చేయాలని నిపుణులు చెబుతున్నారు.

వృద్ధులకు ఆరోగ్య బీమా ఉండటం వల్ల ప్రధానంగా ఆర్థిక ఉపశమనం లభిస్తుంది. కొన్ని పాలసీలు ముందుగా ఉన్న వ్యాధులకు పన్నెండు నెలల తర్వాత కవరేజీ ఇస్తుండగా, కంటి శుక్లాల వంటి చికిత్సలకు ఇరవై నాలుగు నెలల తర్వాత రక్షణ కల్పిస్తున్నాయి. దీని వల్ల అధిక వైద్య ఖర్చుల భయం తగ్గుతుంది.

అలాగే ఇతరులపై ఆధారపడకుండా వృద్ధులు తమ వైద్య ఖర్చులను స్వయంగా నిర్వహించుకునే అవకాశం ఉంటుంది. చాలా బీమా సంస్థలు నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో నగదు రహిత చికిత్స సదుపాయం కల్పిస్తున్నాయి. దీని వల్ల ముందుగా డబ్బు చెల్లించాల్సిన అవసరం లేకుండా చికిత్స పొందవచ్చు.

అనేక ఆరోగ్య బీమా పాలసీలు వార్షిక ఆరోగ్య పరీక్షలను కూడా కల్పిస్తాయి. దీని ద్వారా వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందే అవకాశం ఉంటుంది. అలాగే జీవితకాల పొదుపులను ఆసుపత్రి ఖర్చుల నుంచి కాపాడడంలో కూడా ఈ పాలసీలు సహాయపడతాయి.

కొన్ని పాలసీలు నిర్దిష్ట నిరీక్షణ కాలం తర్వాత ముందుగా ఉన్న వ్యాధులకు కూడా రక్షణ ఇస్తాయి. వృద్ధాప్యంలో సాధారణంగా వచ్చే దీర్ఘకాలిక వ్యాధుల చికిత్స ఖర్చులను కూడా ఇవి భరిస్తాయి. అత్యవసర వైద్య పరిస్థితుల్లో తక్షణ చికిత్స పొందేందుకు అవసరమైన ఆర్థిక సహాయం అందించడం కూడా ఆరోగ్య బీమా ప్రధాన ప్రయోజనంగా చెప్పవచ్చు.

ఆసుపత్రిలో చేరే ముందు ముప్పై రోజుల వరకు, డిశ్చార్జ్ తర్వాత కొన్ని రోజుల వరకు వచ్చే వైద్య ఖర్చులను కూడా కొన్ని పాలసీలు కవర్ చేస్తాయి. అలాగే బెలూన్ సైనుప్లాస్టీ, రోగనిరోధక చికిత్స, మూలకణ చికిత్స వంటి ఆధునిక వైద్య విధానాలకు కూడా కొన్ని పాలసీలు పరిమితి మేరకు రక్షణ కల్పిస్తున్నాయి.

ఇరవై నాలుగు గంటలలో పూర్తయ్యే చిన్న చికిత్సలు, శస్త్రచికిత్సలు కూడా డే కేర్ విధానాల కింద కవరేజ్ పొందుతాయి. ఆసుపత్రిలో చేరినప్పుడు వైద్య ఖర్చులు, ఔట్ పేషెంట్ కన్సల్టేషన్ ఖర్చులు, వార్షిక ఆరోగ్య పరీక్షలు వంటి అనేక ప్రయోజనాలు కూడా ఇందులో ఉంటాయి.

అయితే అందం కోసం చేసే శస్త్రచికిత్సలు, లింగ మార్పిడి శస్త్రచికిత్సలు, స్వయంగా చేసుకున్న గాయాలు, ప్రమాదకర క్రీడల వల్ల కలిగే గాయాలు, మద్యం లేదా మత్తు పదార్థాల దుర్వినియోగం వల్ల వచ్చే చికిత్సలు, పుట్టుకతో ఉన్న కొన్ని లోపాలకు సాధారణంగా ఆరోగ్య బీమా వర్తించదని నిపుణులు చెబుతున్నారు.


# చమురు ప్రభావంతో కుదేలైన మార్కెట్లు




అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా పెరుగుతుండటంతో దేశీయ వాటా మార్కెట్లు వరుసగా రెండో రోజు కూడా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు 2.4 శాతం పెరిగి 106.75 డాలర్లకు చేరుకోవడం మదుపర్లలో ఆందోళన కలిగించింది. అమెరికా, ఇరాన్ మధ్య మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయన్న వార్తలు మార్కెట్లపై మరింత ప్రతికూల ప్రభావం చూపించాయి. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం రద్దయ్యే అవకాశం ఉందన్న ప్రచారం కూడా మదుపర్లను అప్రమత్తం చేసింది. మరోవైపు కృత్రిమ మేధ సంస్థ ఓపెన్ ఏఐ కొత్త సంస్థను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించడం సమాచార సాంకేతిక రంగంపై ప్రభావం చూపింది. దీంతో సమాచార సాంకేతిక రంగ వాటాలు మూడు శాతానికి పైగా పడిపోయాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ కూడా మరింత బలహీనపడింది. రూపాయి విలువ 95.63 స్థాయికి పడిపోవడం ఆర్థిక వర్గాల్లో ఆందోళన కలిగిస్తోంది. ఈ ప్రతికూల పరిణామాల మధ్య దేశీయ సూచీలు భారీ నష్టాలను చవిచూశాయి. గత ముగింపు స్థాయి 76,015తో పోలిస్తే ఉదయం నుంచే నష్టాల్లో ప్రారంభమైన సెన్సెక్స్ రోజంతా ఒత్తిడిలోనే కొనసాగింది. చివరకు సెన్సెక్స్ 1,456 పాయింట్లు కోల్పోయి 74,559 వద్ద ముగిసింది. అదే విధంగా నిఫ్టీ కూడా భారీగా పడిపోయింది. చివరకు 436 పాయింట్ల నష్టంతో 23,379 వద్ద స్థిరపడింది. బ్యాంకింగ్ సూచీ 884 పాయింట్లు కోల్పోగా, మధ్య తరహా సంస్థల సూచీ 1,553 పాయింట్లు నష్టపోయింది.

వాటాల పరంగా చూస్తే ఆయిల్ ఇండియా, ఓఎన్‌జీసీ, బయోకాన్, వేదాంత, హిందుస్థాన్ జింక్ సంస్థల వాటాలు లాభాల్లో నిలిచాయి. ఇక కేన్స్ టెక్నాలజీస్, జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ, యూపీఎల్, కల్యాణ్ జువెల్లర్స్, డిక్సన్ టెక్నాలజీస్ సంస్థల వాటాలు భారీ నష్టాలను నమోదు చేశాయి.

# కెనరా బ్యాంక్ లాభాల్లో తగ్గుదల




కెనరా బ్యాంక్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. మార్చితో ముగిసిన త్రైమాసికంలో బ్యాంక్ ఏకీకృత నికర లాభం రూ.4,506 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ.5 వేల కోట్ల లాభంతో పోలిస్తే ఇది దాదాపు పది శాతం తగ్గుదలగా నిలిచింది.

సమీక్షా కాలంలో బ్యాంక్ మొత్తం ఆదాయం కూడా తగ్గింది. ఏడాది ప్రాతిపదికన 1.85 శాతం తగ్గి రూ.36,662 కోట్లకు పరిమితమైంది. అయితే నికర వడ్డీ ఆదాయం మాత్రం నాలుగు శాతం పెరిగి రూ.9,808 కోట్లకు చేరుకోవడం కొంత ఊరటనిచ్చే అంశంగా మారింది. మరోవైపు బ్యాంక్ ఆస్తుల నాణ్యతలో మెరుగుదల కనిపించింది. స్థూల నిరర్థక ఆస్తుల విలువ 2.94 శాతం నుంచి 1.84 శాతానికి తగ్గింది. అలాగే నికర నిరర్థక ఆస్తుల విలువ 0.70 శాతం నుంచి 0.43 శాతానికి పడిపోయింది. రూపాయల పరంగా చూస్తే, నికర నిరర్థక ఆస్తులు రూ.7,353 కోట్ల నుంచి రూ.5,209 కోట్లకు తగ్గాయి. అలాగే గడిచిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రతి షేరుకు రూ.4.20 డివిడెండ్ ప్రకటిస్తున్నట్లు కెనరా బ్యాంక్ వెల్లడించింది. బ్యాంక్ లాభాల్లో తగ్గుదల కనిపించినప్పటికీ, చెడు రుణాల నియంత్రణలో మాత్రం పురోగతి సాధించినట్లు ఆర్థిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# ఆ సినిమా చేసి తప్పు చేశా: లయ

తెలుగు ప్రేక్షకులకు ఎంతో దగ్గరైన కథానాయికల్లో లయ ఒకరు. తక్కువ సినిమాల్లోనే నటించినప్పటికీ తన సహజ నటనతో ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్నారు. కెరీర్ మంచి స్థాయిలో ఉన్న సమయంలోనే వివాహం చేసుకుని సినీ రంగానికి దూరమైన ఆమె, ఇప్పుడు మళ్లీ తిరిగి సినిమాల్లో నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. ఇటీవల పలు ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్న లయ, తన సినీ ప్రయాణానికి సంబంధించిన అనేక ఆసక్తికర విషయాలను పంచుకుంటున్నారు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, తన కెరీర్‌లో ఒక సినిమా చేసి పెద్ద తప్పు చేశానని వెల్లడించారు. 'స్వయంవరం' సినిమా తర్వాత తాను 'మా బాలాజీ' అనే చిత్రంలో నటించానని, అయితే ఆ నిర్ణయం సరైనది కాదని ఇప్పుడు భావిస్తున్నట్లు తెలిపారు. దివంగత దర్శకుడు కోడి రామకృష్ణపై ఉన్న గౌరవంతోనే ఆ చిత్రానికి ఒప్పుకున్నానని లయ చెప్పారు. అయితే ఆ సమయంలో కథ ఏమిటి, తన పాత్ర ఎలా ఉంటుంది, పారితోషికం ఎంత అనే విషయాలు కూడా అడగకుండా సినిమాకు అంగీకరించినట్లు వెల్లడించారు.

ఇప్పటివరకు ఆ సినిమాను తాను చూడలేదని కూడా లయ వెల్లడించారు. ముఖ్యంగా అందులో తాను పోషించిన విధవరాలి పాత్రలో తనను తాను చూసుకోలేకపోయానని చెప్పారు. ఆ సినిమా కథ ఎలా ఉందో, తన నటన ఎలా ఉందో కూడా ఇప్పటికీ పూర్తిగా తెలియదని పేర్కొన్నారు.

విధవరాలి పాత్రలో తనను తాను తెరపై చూడటం చాలా కష్టంగా అనిపించిందని, అందుకే ఆ చిత్రాన్ని ఇప్పటికీ చూడలేదని లయ భావోద్వేగంగా వెల్లడించారు. ప్రస్తుతం మళ్లీ మంచి పాత్రలను ఎంచుకుంటూ తన రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగిస్తున్న ఆమె, ప్రేక్షకుల నుంచి కూడా మంచి ఆదరణ పొందుతున్నారు.

# 'ఇరుముడి'పైనే రవితేజ ఆశలు



మాస్ మహారాజా రవితేజ గత కొంతకాలంగా బాక్సాఫీస్ వద్ద సరైన విజయాన్ని అందుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకప్పుడు వరుస విజయాలతో టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక మార్కెట్‌ను సృష్టించుకున్న ఆయన, ఇప్పుడు వరుస పరాజయాలతో కెరీర్‌లో కీలక దశను ఎదుర్కొంటున్నట్లు సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇటీవల విడుదలైన సినిమాలు ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోకపోవడంతో, తదుపరి ప్రాజెక్టుల విషయంలో ఆయన చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారని చర్చ జరుగుతోంది. వరుస పరాజయాల తర్వాత మార్కెట్‌లో తన స్థాయిని మళ్లీ నిలబెట్టుకోవాలంటే ముందుగా మంచి విజయాన్ని అందుకోవాల్సిన అవసరం ఉందని రవితేజ భావిస్తున్నారట. అందుకే ప్రస్తుతం కథల ఎంపికలో కూడా ఆయన చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఇక ప్రస్తుతం రవితేజ నటిస్తున్న తాజా చిత్రం 'ఇరుముడి'పై ఇండస్ట్రీలో మంచి ఆసక్తి నెలకొంది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ సినిమా రవితేజ కెరీర్‌లో పూర్తిగా భిన్నమైన ప్రయత్నంగా చెబుతున్నారు. ఇప్పటివరకు ఎక్కువగా మాస్, కామెడీ, యాక్షన్ ప్రధాన చిత్రాల్లో కనిపించిన రవితేజ, ఈసారి థ్రిల్లర్ కథను ఎంచుకోవడం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. 'ఇరుముడి' కథ, కథనం, రవితేజ పాత్ర పూర్తిగా కొత్తగా ఉండబోతున్నాయని సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. ఈ సినిమా విజయమే ఇప్పుడు ఆయన కెరీర్‌కు చాలా కీలకంగా మారిందని విశ్లేషకులు భావిస్తున్నారు.



# నెటిజన్‌కు సీరత్ ఘాటు సమాధానం



అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా నటి సీరత్ కపూర్ ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ కొన్ని ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. అల్లు అర్జున్‌తో కలిసి ప్రైవేట్ విమానం వద్ద దిగిన ఈ చిత్రాలు అభిమానులను ఆకట్టుకున్నాయి. అయితే ఈ ఫొటోలపై స్పందించిన ఓ నెటిజన్ అత్యుత్సాహం ప్రదర్శిస్తూ సీరత్‌పై అగౌరవకర వ్యాఖ్య చేశాడు. "నువ్వు అల్లు అర్జున్ ఆస్తి" అంటూ చేసిన ఈ వ్యాఖ్య సామాజిక మాధ్యమాల్లో చర్చకు దారితీసింది.

ఒక నటిని వస్తువుతో పోలుస్తూ చేసిన ఈ వ్యాఖ్యపై సీరత్ కపూర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సదరు నెటిజన్‌కు ఏమాత్రం తగ్గకుండా గట్టిగా సమాధానం ఇచ్చారు. "ముందు మర్యాదగా మాట్లాడటం నేర్చుకోండి" అంటూ ఆమె తన స్పందనను ప్రారంభించారు. మహిళల ఉనికిని తక్కువ చేసి చూసే ధోరణిని ఆమె తీవ్రంగా తప్పుబట్టారు. "ఒక స్త్రీ ఎప్పటికీ ఎవరి ఆస్తి కాదు. ఆమెకు తనదైన గుర్తింపు, సొంత ఆలోచనలు, కలలు ఉంటాయి" అంటూ సీరత్ స్పష్టం చేశారు. మహిళలను ఎవరి ఆధీనంలో ఉండే వస్తువుల్లా చూడటం మానుకోవాలని, సమాజంలో వారికి ఉన్న ప్రత్యేక వ్యక్తిత్వాన్ని గౌరవించాలని హితవు పలికారు. సీరత్ కపూర్ ఇచ్చిన ఈ సమాధానానికి సామాజిక మాధ్యమాల్లో విశేష స్పందన లభిస్తోంది. కేవలం సినీ ప్రముఖులే కాకుండా, సామాన్య మహిళలు కూడా ఆమె వ్యాఖ్యలను సమర్థిస్తున్నారు. భావ ప్రకటన స్వేచ్ఛ పేరుతో ఎదుటివారిని, ముఖ్యంగా మహిళలను కించపరిచే హక్కు ఎవరికీ లేదని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ఇంటర్నెట్ వేదికగా ట్రోలింగ్ చేసే వారికి సీరత్ స్పందన ఒక గట్టి హెచ్చరికలా నిలిచిందని పలువురు కామెంట్లు చేస్తున్నారు. ఆమె చూపిన ధైర్యసాహసాలపై సినీ వర్గాల నుంచి కూడా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in